చదవండి.. చదివించండి..
నేటి శుభోదయ
నిజమైన వార్తలు... నమ్మకమైన పత్రిక
ప్రతిక్షణం.. ప్రజల కోసం...
వార్తలు, ప్రకటనల కోసం సంప్రదించండి
మా వెబ్‌సైట్ www.netishubhodaya.com
వాట్సాప్ 96965 71571
మీ నమ్మకం.. మా బాధ్యత.. శుభోదయంతో ప్రతి ఉదయం ప్రగతివైపు!

RNI TELTEL/2024/89620
తెలంగాణ
# నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

GK MEDIA
Voice of People
CHANNEL NO. 433
SSLC CABLE NETWORK
SSLC కేబుల్ నెట్‌వర్క్‌లో వస్తుంది

ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 347 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | శుక్రవారం 25 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-

# 22ఏ భూములపై కీలక నిర్ణయం..

## రిజిస్ట్రేషన్లకు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

- 22ఏ జాబితాలోని ఆస్తుల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతి ఉన్న ప్లాట్లు, భవనాలకు వర్తింపు
- తక్షణమే అమల్లోకి వచ్చిన తాజా ఆదేశాలు
- వేలాది మంది ఆస్తి యజమానులకు దక్కనున్న భారీ ఊరట
- అక్రమాలపై విచారణకు శ్రీదేవసేన
- నేతృత్వంలో ప్రత్యేక కమిటీ




**నేటి శుభోదయ, హైదరాబాద్ :** రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరిన భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేలాది మంది ఆస్తి యజమానులకు భారీ ఊరట కల్పించింది. 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ... జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి అనుమతులు పొందిన లేఅవుట్లు, భవనాలకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేయగా, అవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. సాంకేతిక కారణాలు లేదా రెవెన్యూ వర్గీకరణల వల్ల 22ఏ జాబితాలో చేరినప్పటికీ, చట్టబద్ధమైన ప్రణాళికా సంస్థల నుంచి అనుమతులు ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయంతో ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన ఆస్తుల యజమానులు ఇకపై నేరుగా తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా, ఇతరులకు బదిలీ చేసేందుకు కూడా మార్గం సుగమమైంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని అనేక హౌసింగ్ కాలనీల నివాసితులకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనం కలిగించనుంది. చాలాకాలంగా స్తంభించిపోయిన స్థిరాస్తి లావాదేవీలు తిరిగి ఊపందుకుంటాయని భావిస్తున్నారు.ఈ ప్రయోజనం పొందాలనుకునే యజమానులు సంబంధిత పత్రాలతో అధికారులకు దరఖాస్తు చేసుకుని, తమ ఆస్తులపై ఉన్న రిజిస్ట్రేషన్ ఆంక్షలను తొలగించుకోవచ్చని రెవెన్యూ శాఖ సూచించింది. మరోవైపు, 22ఏ భూముల అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చ అనంతరం ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.

## బాలాపూర్‌కు ముందే రికార్డు మోత..

### - హైదరాబాద్‌లో కోటి పలికిన గణేశుడి లడ్డూ!



- రాజేంద్రనగర్ కీర్తి రిచ్‌మండ్‌లో కోటి దాటిన గణేశ్ లడ్డూ వేలం
- శక్తిమాన్ బృందం రూ.1.01 కోట్లకు లడ్డూ కైవసం
- గతేడాది ఇదే కమ్యూనిటీలో లడ్డూ రూ.2.31 కోట్లు పలికిన రికార్డు
- రేపు జరగనున్న బాలాపూర్ లడ్డూ వేలంపై ఉత్కంఠ
- గతేడాది బాలాపూర్ లడ్డూ ధర రూ.35 లక్షలుగా నమోదు

2

## స్పీకర్ చాటున దాక్కోవచ్చని భావించిన రాహుల్, రేవంత్‌లకు ఇది "సుప్రీం చెంపపెట్టు" : కేటీఆర్



- దానం నాగేందర్ అనర్హతను సమర్థించిన సుప్రీంకోర్టు
- ఇది రాహుల్, రేవంత్‌కు తగిలిన చెంపపెట్టు అన్న కేటీఆర్
- ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించాలని చూశారని విమర్శ
- రాజ్యాంగాన్ని కాపాడాలనే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి బయటపడిందన్న హరీశ్ రావు

2

## అక్టోబరు 2న యూపీఐ చెల్లింపులు బంద్..




»2

## హైదరాబాద్ గణేశ్ బందోబస్తు విధుల్లో ఎస్సై దుర్మరణం.. నిందితుడి కోసం పోలీసుల గాలింపు

- గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో ఎస్సై వెంకన్న మృతి
- హైదరాబాద్‌లో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఘటన
- ప్రమాదం తర్వాత స్వగ్రామానికి వెళ్లగా ఆరోగ్యం క్షీణించి కన్నుమూత

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** భాగ్యనగర గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. హైదరాబాద్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన ఓ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) చికిత్స పొందుతూ మృతి చెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూటౌన్ ఠాణాలో ఎస్సైగా పనిచేస్తున్న కె. వెంకన్న (57) ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. వరంగల్ జిల్లాకు చెందిన ఆయన, గణేశ్ నిమజ్జన బందోబస్తు కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వచ్చారు. వివరాల్లోకి వెళితే, ఎన్టీఆర్ గార్డెన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద ఎస్సై వెంకన్నకు విధులు కేటాయించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2 గంటల సమయంలో, సచివాలయం వైపు నుంచి అంబేద్కర్ విగ్రహం వైపు వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు వెంకన్నను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఎస్సై రోడ్డుపై పడిపోగా తల, కుడి మోకాలు, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తి వాహనంతో సహా అక్కడి నుంచి ......

»2



## మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది : హరీశ్ రావు

- తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేశారంటూ హరీశ్ మండిపాటు
- ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి నిందలు వేస్తున్నారని విమర్శ
- ఇప్పటి వరకు డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని వ్యాఖ్య

»2




## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో బొగ్గు కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం : జగదీశ్ రెడ్డి

- యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను పరిశీలించిన జగదీశ్ రెడ్డి
- విద్యుత్ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శ
- 40 లక్షల టన్నుల బొగ్గును పక్కదారి పట్టిస్తున్నారని మండిపాటు



»2

## వరుసగా 3 రోజులు బ్యాంకుల బంద్.. కేంద్రం కీలక నిర్ణయం

- సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల పాటు బ్యాంకుల సమ్మె
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ముందే జీతాలు
- సెప్టెంబర్ 25నే వేతనాలు చెల్లించాలని కేంద్రం ఆదేశం
- ప్రజల సౌలభ్యం కోసం ఆదివారం బ్యాంకులు తెరిచి ఉంచాలని నిర్ణయం




**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇబ్బందులు కలగకుండా సెప్టెంబర్ నెల జీతాలు, పెన్షన్లను ముందుగానే చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 25వ తేదీనే వేతనాలు అందనున్నాయి.

»2

## 'ఎన్నికలకు సిద్ధం అవుతా'..

### సుప్రీం తీర్పుపై దానం నాగేందర్

- సుప్రీం తీర్పును గౌరవిస్తున్నానన్న దానం
- న్యాయపోరాటం చట్టపరంగానే చేశానని వెల్లడి
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సిద్ధమని ప్రకటన
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకు మార్గం సుగమం



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టు తీర్పుపై స్పందించారు. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సంపూర్ణంగా గౌరవిస్తున్నానని తెలిపారు. చట్టపరమైన ప్రక్రియ పట్ల ఉన్న గౌరవంతోనే తాను న్యాయపోరాటం చేశానని చెప్పారు. ఇక తన భవిష్యత్తును ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటానని స్పష్టం చేశారు. "కోర్టు తీర్పు ఇలా వస్తుందని ముందే ఊహించాను. అయితే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం కొంత ఊరట లభిస్తుందని భావించాను. అందుకే చట్టపరంగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాను" అని దానం నాగేందర్ పేర్కొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో తాను సిద్ధంగా ఉన్నట్లు దానం తెలిపారు. ఖైరతాబాద్ ప్రజలతో తనకు దశాబ్దాలుగా అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ వారికి అండగా ఉన్నానని చెప్పారు. రాబోయే ఉప ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి వారి ఆశీర్వాదం కోరతానన్నారు. ప్రజల మద్దతు తనకే ఉంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

»2

## 'ఎన్నికలకు సిద్ధం అవుతా'..
### సుప్రీం తీర్పుపై దానం నాగేందర్

**మొదటిపేజీ తరువాయి..** 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. దీనిపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఆయనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించి ఖైరతాబాద్ సీటు ఖాళీ అయినట్లు పేర్కొంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. నేడు అత్యున్నత న్యాయస్థానం ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. దీంతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికకు మార్గం ఏర్పడింది.

## అక్టోబరు 2న యూపీఐ చెల్లింపులు బంద్..

**మొదటిపేజీ తరువాయి..** దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై ఛార్జీలు విధించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై వ్యాపార వర్గాలు భగ్గుమన్నాయి. ఈ కొత్త నిబంధనలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నాడు "నో యూపీఐ డే" పాటించాలని పలు వాణిజ్య, వ్యాపార సంఘాలు పిలుపునిచ్చాయి. ఆ రోజున తమ దుకాణాల్లోని యూపీఐ క్యూఆర్ కోడ్‌లు, స్కానర్లు, సౌండ్ బాక్సులను నల్లటి వస్త్రంతో కప్పివేసి నిరసన తెలపాలని నిర్ణయించాయి.

**అక్టోబర్ 15 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు**

అక్టోబర్ 15 నుంచి యూపీఐ చెల్లింపులకు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. దీని ప్రకారం, వ్యాపారులు (P2M – పర్సన్ టు మర్చంట్) స్వీకరించే రూ.2,000కు పైబడిన ప్రతి యూపీఐ లావాదేవీపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (MDR) చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఒక లావాదేవీపై గరిష్ఠంగా రూ.300 మాత్రమే ఛార్జ్ చేస్తారు. అయితే, వ్యక్తుల మధ్య జరిగే (P2P – పర్సన్ టు పర్సన్) యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. అలాగే, నెలకు రూ.1 లక్ష వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు (P2PM) కూడా ఈ ఎండీఆర్ నుంచి మినహాయింపు ఇచ్చారు. 2026 ఆగస్టు నెలలోనే వ్యాపారులకు రూ.8.95 ట్రిలియన్ల విలువైన 15.51 బిలియన్ల లావాదేవీలు జరగ్గా, అందులో రూ.2,000కు పైబడిన చెల్లింపుల వాటానే సుమారు 67 శాతం ఉండటం గమనార్హం.

**వ్యాపారుల ఆందోళన ఎందుకు?**

తమకు ఇప్పటికే చాలా తక్కువ లాభాలు వస్తుండగా, ఇప్పుడు యూపీఐపై కొత్త ఛార్జీలు విధించడం వల్ల ఆర్థికంగా మరింత భారం పడుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ ఇండియాను ప్రోత్సహించి, పారదర్శక లావాదేవీలు జరుపుతున్న తమను ప్రోత్సహించాల్సింది పోయి, ఇలా ఛార్జీలతో శిక్షించడం సరికాదని వారు వాదిస్తున్నారు. మహారాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ (MACCIA), ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ ఫెడరేషన్ (AICPDF) వంటి అనేక జాతీయ స్థాయి సంఘాలు ఈ నిరసనకు మద్దతు ప్రకటించాయి. ఈ అంశంపై పెట్రోలియం డీలర్లు, స్టాక్ బ్రోకర్లు కూడా తమకు మినహాయింపులు ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే పెట్రోలియం మంత్రిత్వ శాఖ డీలర్లతో చర్చలు జరపగా, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలపై విధించిన 0.02 శాతం ఎండీఆర్‌పై బ్రోకర్ల ఆందోళనలను పరిశీలిస్తామని సెబీ హామీ ఇచ్చింది. అక్టోబర్ 15 లోగా ప్రభుత్వం ఈ ఛార్జీలను ఉపసంహరించుకోకపోతే తమ నిరసనను మరింత ఉద్ధృతం చేస్తామని వ్యాపార సంఘాలు హెచ్చరించాయి.

## బాలాపూర్‌కు ముందే రికార్డు మోత..
### హైదరాబాద్‌లో కోటి పలికిన గణేశుడి లడ్డూ!

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్‌లో గణేశ్ లడ్డూ వేలం పాటలో మరోసారి భారీ ధర నమోదైంది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కీర్తి రిచ్‌మండ్ గేటెడ్ కమ్యూనిటీలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన వేలంలో గణపతి లడ్డూ ఏకంగా రూ.1.01 కోట్లు పలికింది. ప్రతి ఏటా పోటాపోటీగా జరిగే ఈ వేలంలో ఈసారి శక్తిమాన్ బృంద సభ్యులు లడ్డూను కైవసం చేసుకున్నారు. కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో లడ్డూ వేలానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. కమ్యూనిటీ వాసులు నాలుగు గ్రూపులుగా విడిపోయి ప్రతి ఏటా పోటీ పడుతుంటారు. ఈసారి కూడా అర్ధరాత్రి వరకు ఉత్కంఠభరితంగా సాగిన వేలంలో శక్తిమాన్ బృందం విజయం సాధించింది. గతేడాది (2025) ఇదే కమ్యూనిటీలో లడ్డూ రికార్డు స్థాయిలో రూ.2.31 కోట్లు పలకడం గమనార్హం. ఆ రికార్డుతో పోలిస్తే ఈసారి ధర తక్కువే అయినప్పటికీ, కోటి రూపాయల మార్కును దాటడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. స్వామివారి లడ్డూను దక్కించుకోవడం వల్ల శుభం, ఐశ్వర్యం కలుగుతాయనే బలమైన విశ్వాసంతో భక్తులు ఎంతటి ధరకైనా వెనుకాడటం లేదు. హైదరాబాద్‌లోని గేటెడ్ కమ్యూనిటీలలో లడ్డూ వేలం పాటలు కోట్లలో జరుగుతుండగా, ఇప్పుడు అందరి దృష్టి తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే బాలాపూర్ లడ్డూ వేలంపై కేంద్రీకృతమైంది. రేపు చారిత్రక బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం జరగనుంది. 1994లో కేవలం రూ.450తో మొదలైన ఈ వేలం ప్రస్థానం, మూడు దశాబ్దాల్లో లక్షల రూపాయలకు చేరింది. గతేడాది బాలాపూర్ లడ్డూను కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ్ గౌడ్ రూ.35 లక్షలకు దక్కించుకోగా, 2024లో రూ.30.01 లక్షలు పలికింది. ఈసారి పూరీ జగన్నాథ ఆలయ నమూనాలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువైన బాలాపూర్ గణపయ్య లడ్డూ (21 కిలోలు) కొత్త రికార్డు సృష్టిస్తుందా? అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. గేటెడ్ కమ్యూనిటీలలో కోట్లలో ధర పలుకుతున్న నేపథ్యంలో బాలాపూర్ లడ్డూ ఆ రికార్డులను అందుకుంటుందా? లేదా? అన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. బాలాపూర్ వేలం అనంతరం జరిగే గణేశుడి శోభాయాత్రతోనే నగర నిమజ్జనం ప్రారంభం కావడం ఆనవాయతీ.

## హైదరాబాద్ గణేశ్ బందోబస్తు విధుల్లో ఎస్సై దుర్మరణం..
### నిందితుడి కోసం పోలీసుల గాలింపు

**మొదటిపేజీ తరువాయి..** పరారయ్యాడు. ప్రమాదం అనంతరం, వెంకన్నను లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. కాస్త కోలుకున్న తర్వాత ఆయన సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఘటనపై ఫిర్యాదు చేసి, అనంతరం తన స్వగ్రామమైన కిష్టాపురానికి బయలుదేరారు. అయితే, గ్రామానికి చేరుకున్నాక మధ్యాహ్నం తర్వాత ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా, తలలో తీవ్ర రక్తస్రావం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకన్న కన్నుమూశారు. ఈ ఘటనపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

**ఎస్సై మృతిపై సీపీ సజ్జనార్ తీవ్ర విచారం**

ఎస్సై వెంకన్న మృతి పట్ల హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. "గణేశ్ నిమజ్జన బందోబస్తులో భాగంగా విధి నిర్వహణలో ఉన్న వెంకన్నగారు గుర్తుతెలియని వాహనం ఢీకొని మరణించడం అత్యంత బాధాకరం, దురదృష్టకరం. ప్రజల భద్రత కోసం పనిచేస్తూ ఆయన ప్రాణాలు కోల్పోవడం తెలంగాణ పోలీసు శాఖకు తీరని లోటు" అని అన్నారు. ఈ విషాద సమయంలో వెంకన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కమిషనర్, ఆ కుటుంబానికి శాఖాపరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితుడిని త్వరలోనే పట్టుకొని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో బొగ్గు కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం : జగదీశ్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి..** నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో ఎదురవుతున్న బొగ్గు కొరతకు, విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన ఈరోజు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్లాంట్ అధికారులతో సమావేశమై విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి గల సాంకేతిక, పరిపాలనాపరమైన కారణాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ప్లాంట్లకు సక్రమంగా సరఫరా చేయకుండా దాదాపు 40 లక్షల టన్నుల బొగ్గును పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలోని పవర్ ప్లాంట్లకు బొగ్గు కొరత సృష్టించి, ప్రజలను ముఖ్యంగా రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏ విధంగానైతే 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందించిందో, అదే రీతిలో పవర్ ప్లాంట్లకు పూర్తిస్థాయిలో బొగ్గు సరఫరా చేసి నిరంతర విద్యుత్ అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది : హరీశ్ రావు

**మొదటిపేజీ తరువాయి..** తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు తెలిపారు. ఈ విషయంలో సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తమపై ఈ తరహా నీచమైన నిందలు వేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లైనా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని అన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను కూడా స్పీకర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటివని అభివర్ణించారు. లోక్‌సభలో రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించారని, అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఫిరాయింపు నేతలు రాజీనామాలు చేసి ప్రజా తీర్పును కోరాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## వరుసగా 3 రోజులు బ్యాంకుల బంద్.. కేంద్రం కీలక నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి..** దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇబ్బందులు కలగకుండా సెప్టెంబర్ నెల జీతాలు, పెన్షన్లను ముందుగానే చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 25వ తేదీనే వేతనాలు అందనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ ఈ మేరకు ఒక అధికారిక మెమోరాండం విడుదల చేసింది. దీని ప్రకారం, రక్షణ, పోస్టల్, టెలికమ్యూనికేషన్స్ విభాగాలతో సహా అన్ని కేంద్ర ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు శుక్రవారం నాడే జీతాలు చెల్లించనున్నారు. అదే రోజున కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు కూడా పెన్షన్లు అందజేస్తారు. ఈ ముందస్తు చెల్లింపులను అక్టోబర్ బకాయిలలో సర్దుబాటు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. వారానికి ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యూఎఫ్‌బీయూ) ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో మూడు రోజుల పాటు ఈ సమ్మె కొనసాగనుంది. ఇది బ్యాంకులకు అర్ధ సంవత్సర ముగింపు సమయం కావడం గమనార్హం.

## స్పీకర్ చాటున దాక్కోవచ్చని భావించిన రాహుల్, రేవంత్‌లకు ఇది "సుప్రీం చెంపపెట్టు" : కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి..** బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద తనపై అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఇది లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిలిన "సుప్రీం చెంపపెట్టు" అని అభివర్ణించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి దానం నాగేందర్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. "ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించి, స్పీకర్ చాటున దాక్కోవచ్చని రాహుల్, రేవంత్ భావించారు. స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని ఫిరాయింపులను ప్రోత్సహించే వారి ప్రయత్నాలను ఈ తీర్పు బట్టబయలు చేసింది" అని కేటీఆర్ ఆరోపించారు. త్వరలో ఖైరతాబాద్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో ప్రజలు మూడేళ్ల ద్రోహానికి, హామీల ఉల్లంఘనకు తగిన తీర్పు ఇస్తారని ఆయన వ్యాఖ్యానించారు. "ఒక వికెట్ పడింది.. త్వరలో మరిన్ని పడతాయి" అని హెచ్చరిస్తూ, తన పోస్ట్ చివరలో "మార్క్ మై వర్డ్స్, ఎమ్మెల్యే చోర్ @రాహుల్‌గాంధీ" అని ఘాటుగా విమర్శించారు.

**కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై హరీశ్ రావు ఫైర్**

సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ శాసనసభ ఉప నాయకుడు హరీశ్ రావు కూడా స్వాగతించారు. "రాజ్యాంగాన్ని కాపాడతాం" అని చెప్పే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి ఇది చెంపపెట్టు అని అన్నారు. "పదేపదే 'సంవిధాన్ బచావో' అని నినదించే రాహుల్ గాంధీకి ఇప్పుడు అసలైన పరీక్ష ఎదురైంది. ఆయనకు నిజంగా రాజ్యాంగంపై నమ్మకం ఉంటే, కాంగ్రెస్‌లో చేరిన మిగతా ఎమ్మెల్యేలందరితో వెంటనే రాజీనామా చేయించి, తిరిగి ప్రజా తీర్పు కోరాలి" అని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడి, తెలంగాణలో తమ పార్టీ చర్యలపై మౌనంగా ఉండటం సరికాదని హరీశ్ రావు విమర్శించారు. "సంవిధాన్ బచావో అనేది రాజ్యాంగ నిబద్ధతా లేక కేవలం రాజకీయ నినాదమా?" అని ప్రశ్నించారు.

# గడ్కోల్ గ్రామంలో వైభవంగా గణేష్ లడ్డూ వేలం

- రూ. 5,000లకు దక్కించుకున్న విలేజ్ కమిటీ చైర్మన్ కామారెడ్డి సంతోష్ రెడ్డి



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :**
సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగాయి . గ్రామంలోని విలేజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక మండపంలో గణేష్ లడ్డూ వేలం పాటను అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ వేలం పాటలో గ్రామానికి చెందిన పలువురు భక్తులు పోటీపడగా, గ్రామ కమిటీ చైర్మన్ కామారెడ్డి సంతోష్ రెడ్డి గారు రూ. 5,000/- (ఐదు వేల రూపాయలకు) లడ్డూను దక్కించుకున్నారు. స్వామివారి ప్రసాదమైన లడ్డూను దక్కించుకోవడం పట్ల సంతోష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ కామారెడ్డి సంతోష్ రెడ్డి మాట్లాడుతూ... ఆ విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో గడ్కోల్ గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. గ్రామంలో శాంతిభద్రతలు, అభివృద్ధి నిరంతరం కొనసాగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూషణ్ రెడ్డి.గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# సిరికొండలో ఘనంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- లబ్ధిదారులకు రూ. 2.14 లక్షల చెక్కులు అందజేసిన కాంగ్రెస్ నాయకులు





**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :**
పేదల వైద్య ఖర్చులకు సీఎం సహాయ నిధి కొండంత అండ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ప్రజా సంక్షేమ పాలనలో పేద ప్రజల ఆరోగ్యం కోసం సీఎం సహాయ నిధి (CMRF) కొండంత అండగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గౌరవ శాసనసభ్యులు శ్రీ భూపతి రెడ్డి గారి ఆదేశాల మేరకు, గురువారం సిరికొండ మండల కేంద్ర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 7 గురు లబ్ధిదారులకు రూ. 2,14,000 విలువైన చెక్కులను నాయకులు విజయవంతంగా అందజేశారు.లబ్ధిదారుల వివరాలు:బొంతల లత – రూ. 22,000దర్శనం బాలయ్య – రూ. 52,000సునుగురి నర్సయ్య – రూ. 15,000ఏదురుగట్ల రామస్వామి – రూ. 10,000బోడ చిన్న బాబు – రూ. 18,500కొమ్ము బోగన్న – రూ. 57,000ఇందూరి బాల లక్ష్మి – రూ. 39,500ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న పేద కుటుంబాలకు ఎమ్మెల్యే భూపతి రెడ్డి గారి చొరవతో ప్రభుత్వం నుంచి ఈ ఆర్థిక సాయం అందడం అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న ప్రతీ పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేగం సాయన్న, రాజేందర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ రాము మొట్టల, గ్రామ శాఖ అధ్యక్షుడు రాజ్ కుమార్, మైనారిటీ సెల్ నాయకుడు ఆసిఫ్, మాజీ సర్పంచ్ చిట్యాల రవిశంకర్, గ్రామ వైస్ ప్రెసిడెంట్ గంగూలీ, గ్రామ శాఖ జనరల్ సెక్రెటరీ సాలెంబిన్ అహ్మద్, చాకలి రమేష్‌తో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధల ఆధ్యాత్మిక చింతనతో ప్రత్యేక పూజలు

- ఇబ్రహీంపట్నం ఏసిపి కెవిపి రాజు
- పట్నం ఎస్ హెచ్ ఓ మహేందర్ రెడ్డిట్రాఫిక్, సీఐ జితేందర్ రెడ్డి
- ప్రముఖ సంఘ సేవకులు బజారు బిక్షపతి





**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :**
ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు శంబాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథునికి ఇబ్రహీంపట్నం ఏసీపీ కెవిపి రాజు, సిఐ మహేందర్ రెడ్డి ట్రాఫిక్ సిఐజితేందర్ రెడ్డిలు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపి రాజు మాట్లాడుతూ, గణనాధుని ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి,వర్షాలు బాగా కురిసిపంటలు బాగా పండాలని ఆయన కోరారు,అదేవిధంగా డ్రగ్స్ మత్తుకు దూరంగా ఉండాలని మంచి భవిష్యత్తును జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు.ఇబ్రహీంపట్నం ఎస్ హెచ్ ఓ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ,యూత్ యువత అందరూ కూడా సైబర్ నేరల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆన్లైన్ గేమ్ కు దూరంగా ఉండాలని ఆయన సూచించారు.మంచి భవిష్యత్తు ఎంచుకోవాలని కోరారు ట్రాఫిక్ సిఐ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, హెల్మెట్ ధరించాలి త్రిబుల్ రైడింగ్ చేయరాదు ట్రాఫిక్ రూల్స్ పాటించి సురక్షితంగా ప్రయాణం చేసి మీ ప్రాణాలను రక్షించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు బజారు బిక్షపతి మహేందర్,సాయి శ్రీనివాస్, శ్రీకాంత్,ఏ మహేష్ గ్రామస్తులు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ శ్రేణుల సమక్షంలో మండల అధ్యక్షుడు నీలకంఠ పాండు జన్మదిన వేడుకలు



**తలకొండపల్లి , సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :**
భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తలకొండపల్లి మండల అధ్యక్షుడు నీలకంఠ పాండు జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో అభిమానులు, పార్టీ శ్రేణుల మధ్య ఆయన భారీ కేక్ కట్ చేశారు.అనంతరం నీలకంఠ పాండుకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. నీలకంఠ పాండు నాయకత్వంలో తలకొండపల్లి మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా పనిచేస్తాయని స్పష్టం చేశారు. ఈ వేడుకలకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీజేపీ, బీజేవైఎం (BJYM) నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్ చారి, పద్మ అనిల్ ముదిరాజ్, సర్పంచులు ఇమ్మిడి మహేష్, జినుకుంట్ల చంద్రశేఖర్, ఉప సర్పంచ్ రాఘువేందర్, విజయ్, శ్రీశైలం యాదవ్, జంగయ్య యాదవ్, బొల్లా శ్రీను, మనోహర్, పర్వతాలు, నరేందర్, ప్రవీణ్‌తో పాటు వివిధ గ్రామాల బీజేపీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు




**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి గానూ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన స్థానిక విద్యార్థులు శుక్రవారం సెప్టెంబర్ 25వ తేదీన తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో నేరుగా హాజరై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు తీసురవాల్సిన ధృవపత్రాలుపదవ తరగతి (SSC) మార్కుల మెమో ఇంటర్మీడియట్ మార్కుల మెమో ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ కుల ధృవీకరణ పత్రం ఆదాయ ధృవీకరణ పత్రంప్రత్యేక కేటగిరీకి సంబంధించిన సర్టిఫికెట్లు (వర్తించే వారికి) ఆసక్తి గల విద్యార్థులు కోరారు.

# ఇంధన పొదుపే భవిష్యత్తుకు పునాది



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన శక్తి సామర్థ్య బ్యూరో (BEE) మరియు నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ టి పీసీ ) వారి ఆదేశాల మేరకు, జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వుల ప్రకారం విద్యార్థుల్లో ఇంధన పరిరక్షణపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో గురువారం సత్యశోధక్ పాఠశాలలో చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరిగింది.ఈ పోటీలు 6,7,8 తరగతుల విద్యార్థులకు "పాఠశాలలో – ఇంటిలో ఇంధనాన్ని ఆదా చేద్దాం" మరియు 9,10 తరగతుల విద్యార్థులకు "ఇంధన సంరక్షణే ఇంధన భద్రతకు కీలకం" అనే అంశాలపై విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించారు.విద్యార్థులు ఇంధనాన్ని వృథా చేయకుండా వినియోగించడం, విద్యుత్ పొదుపు, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాలకు ఇంధన భద్రత వంటి అంశాలను తమ చిత్రాల్లో చక్కగా ప్రతిబింబించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ, చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో ఇంధన పొదుపు అలవాట్లను పెంపొందించడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. ఈ చిత్రలేఖన పోటీ ప్రధాన ఉద్దేశం విద్యార్థుల్లో అవగాహనతో పాటు సామాజిక బాధ్యతా భావాన్ని పెంపొందించడమేనని, "ఇంధనాన్ని పొదుపు చేద్దాం – భవిష్యత్తును కాపాడుకుందాం" అనే భావనను విద్యార్థుల్లో నింపడమే లక్ష్యమని తెలియ పరిచడమైనది. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ చిత్రాలు గీసిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య బహుమతులు అందజేసి అభినందించారు. రెండు విభాగాలలో ఎంపికైన ఉత్తమ చిత్రాలను రాష్ట్ర స్థాయి పోటీలకు NTPC ఎన్ టి పి సి కార్యాలయానికి పంపడమైనది . ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ మేజర్ పద్మపాని ఆచార్య యూత్ అసోసియేషన్- గణనాథుడికి ప్రత్యేక పూజలు

- మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షుడు అంతటి రాజు గౌడ్
- వైయస్సార్ మాధగో ని జంగయ్య గౌడ్



**ఇ బ్రహీంప ట ్నం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :**
మంచాల మండలం ఆరుట్ల గ్రా మంలో వినాయక చవితి గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ పద్మపాణి ఆచార్య యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రతిష్టించిన గణనాధుడికి ప్రత్యేక పూజలు చేసిన శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షుడు అంతటి రాజు గౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ సిండికేట్ గ్రూప్ సభ్యులు శ్రీ మేజర్ ఆచార్య పద్మపాని యూత్ అసోసియేషన్ సభ్యులు శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కొత్తపల్లి రవిగౌడ్ శేఖర్ గౌడ్ సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదాన ప్రసాదం,స్వీకరించారు. ఈకార్యక్రమంలో శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ సభ్యులు గ్రామపం చాయతీ వార్డుసభ్యుడు మహమ్మద్ ఇమ్రాన్.ఇందిరమ్మ కమిటీసభ్యుడు చెరుకు నరసింహగౌడ్ ,నుకం బాలరాజు ముదిరాజ్ ,నూతనగంటి కృష్ణ, మాడపాకుల యాదగిరి ,పల్లె శ్రీనివాస్ గౌడ్ ,నుకం నగేష్ ముదిరాజ్ ,ఎన్నుదుల మహేష్, తవిటి నరసింహ, ఎన్నుదుల సురేష్ ముదిరాజ్ ,మాడపాకుల కృష్ణ మేజర్ ఆచార్య పద్మపాణి యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నా రు.

## భక్తితో.. భద్రతతో వినాయక నిమజ్జనం నిర్వహిద్దాంచైతన్య కిరణ్



**వికారాబాద్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** వికారాబాద్: నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక నిమజ్జన శుభాకాంక్షలు. భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకల్లో పాల్గొంటూనే ప్రతి ఒక్కరి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని చైతన్య కిరణ్ మల్కాపురం కోరారు.నిమజ్జన వేడుకల్లో పిల్లలు, మహిళలు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రహదారి భద్రతా నిబంధనలు పాటిస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు, పోలీసుల సూచనలను పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు.భక్తితో పాటు భద్రత, బాధ్యతకు ప్రాధాన్యతనిస్తూ వినాయక నిమజ్జన వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని చైతన్య కిరణ్ మల్కాపురం ఆకాంక్షించారు.

## పీర్జాదిగూడ గోకుల్ నగర్ గణపతి లడ్డు మూడోసారి కైవసం చేసుకున్న వీరా శ్రీకాంత్ పటేల్



**ఉప్పల్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ గోకుల్ నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన లడ్డు వేలం పాటలో వీరా శ్రీకాంత్ పటేల్ ఒక లక్షా అరవై అయిదు వేల నూట పదహారు రూపాయలకు కైవసం చేసుకున్నారు. గత మూడు సంవత్సరాలుగా గణపతి లడ్డు ను దక్కించుకోవడం ఆనందంగా ఉందని శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీకాంత్ పటేల్ కు ఘనంగా సన్మానించారు.

## మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని పరామర్శించిన

- మియ్యపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు
- బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు







**కొల్లాపూర్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** పితృవియోగంతో బాధలో ఉన్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని మియ్యపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. ఈ సందర్భంగా సింగోటం గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీ.శే. బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మియ్యపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. బీరం లక్ష్మారెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. "లక్ష్మారెడ్డి సేవలు చిరస్మరణీయం" బీరం లక్ష్మారెడ్డి మృతి కుటుంబానికే కాకుండా ఆయనతో అనుబంధం ఉన్న వారందరికీ తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మియ్యపూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ సుధాకర్ రెడ్డి, పుల్లారెడ్డి, శివశంకర్, పెద్ద బీరయ్య, పవన్ కుమార్, గనుకొండ రాజు, క్యాతూరు భాస్కర్, శివ, జీవన్ రెడ్డి, శంకర్, రాము, మియాపూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వికారాబాద్ మండల అభివృద్ధికి రూ.7.95 కోట్ల నిధులు

- నూతన రహదారుల నిర్మాణానికి రూ.40.60 కోట్లు మంజూరు




**వికారాబాద్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** వికారాబాద్: తెలంగాణ శాసనసభ స్పీకర్, వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో వికారాబాద్ మండలంలో నూతన రహదారుల నిర్మాణానికి రూ.40.60 కోట్ల విలువైన అధికారిక ఉత్తర్వులు విడుదల కావడం పట్ల ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా వికారాబాద్ మండలానికి రూ.7.95 కోట్ల నిధులు విడుదల కావడంపై సర్పంచులు స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.వికారాబాద్ ఎంపీడీవో కార్యాలయ సభా ప్రాంగణంలో గురువారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుదీర్ ఆధ్వర్యం వహించగా, వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలు, శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహించారు.ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి వికారాబాద్ మండలాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలపాలని సమావేశంలో సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అందుబాటులో ఉన్న నిధులను సమర్థంగా వినియోగించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వెల్జాల్ లో భక్తిని చాటుకున్న బీజేపీ నేత రాఘవేందర్ గౌడ్





**తలకొండపల్లి, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో గణేషుని నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని పలు గణపతి ఉత్సవ కమిటీల సభ్యులు అడిగిన వెంటనే కాదనకుండా, "నేనున్నాను" అంటూ ప్రముఖ బిజెపి సీనియర్ నాయకుడు, గౌడ సంఘం అధ్యక్షుడు తిరుమణి రాఘవేందర్ గౌడ్ తన ఉదారతను చాటుకున్నారు. స్వామివారి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాల కోసం తన వంతు సహాయంగా 50 కిలోల బియ్యాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు.వస్తురూపంలోనే కాకుండా, కమిటీ సభ్యులు అడిగిన వెంటనే గణేష్ చందాలను కూడా పెద్దమనసుతో అందజేసి ఆ గణనాథునిపై తనకు ఉన్న భక్తిని, ప్రేమాభిమానాలను ఆయన చాటుకున్నారు. గ్రామంలో ఏ శుభకార్యం జరిగినా, ఎవరు కష్టాల్లో ఉండి సహాయం కోరినా వెనుకాడకుండా ఆర్థికంగా, వస్తురూపకంగా నిరుపేదలకు అండగా నిలవడం రాఘవేందర్ గౌడ్ నైజమని స్థానికులు కొనియాడుతున్నారు.అడిగిన వెంటనే స్పందిస్తూ ఊరి పెద్దగా, ఆపద్బాంధవుడిగా నిలుస్తున్న తిరుమణి రాఘవేందర్ గౌడ్ పేరు ప్రస్తుతం వెల్జాల్ గ్రామంలో ఎవరి నోట విన్నా మారుమోగుతోంది. ఈ ఏడాది ఆ విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలతో రాఘవేందర్ గౌడ్ అనుకున్న కోరికలన్నీ నెరవేరాలని, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన అభిమానులు, గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

## వయోవృద్ధుల సంక్షేమమే లక్ష్యం.. వారోత్సవాలకు శ్రీకారం

- అక్టోబర్ 1 వరకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు
- అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**మేడ్చల్ , సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** వయోవృద్ధుల సంక్షేమం, హక్కులు, వారి పట్ల సమాజ బాధ్యతపై అవగాహన కల్పించే లక్ష్యంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలకు బుధవారం శ్రీకారం చుట్టారు. మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు జిల్లావ్యాప్తంగా ఈ వేడుకలను నిర్వహించనున్నారు.వారోత్సవాల్లో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వయోవృద్ధుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేలా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, డీఆర్‌డీఏ అధికారి సాంబశివరావు, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గబ్బిలాల పేటలో నూతన పాఠశాల భవనానికి స్థల పరిశీలన

- ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** కాప్రా మండలం గబ్బిలాల పేటలో అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ మను చౌదరి గురువారం పరిశీలించారు. పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల సంఖ్య, తరగతి గదుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు.పాఠశాలలో ఆధార్ లేని విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి ఆధార్ అందించాలని కాప్రా తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి స్థల సేకరణలో భాగంగా గబ్బిలాల పేటలోని సర్వే నంబర్లు 285, 299, 300, 185లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయా సర్వే నంబర్లలో భూ వివాదాలు, కోర్టు కేసులు తదితర సమస్యలు ఉన్నాయా అనే అంశాలపై సమగ్ర నివేదిక అందించాలని సూచించారు.ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి సర్వే నంబర్ 300 లేదా 185లో స్థలం కేటాయిస్తే స్థానిక విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి విద్యాశాఖ నుంచి ఇప్పటికే అనుమతులు మంజూరైనట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖాధికారి రేణుక, కాప్రా మండల తహసీల్దార్ మతిన్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో అగ్నిప్రమాదం

- పాక్షికంగా దెబ్బతిన ఇంటిని పరిశీలించిన
- మండల ఎంపీడీవో సూర్న ఆదర్శ్ గౌడ్
- మండల తహసిల్దార్ శ్రీనివాస్
- ఉమ్మడి మండలాల మాజీ జడ్పిటిసి ఇటిక్యాల కృష్ణ ప్రసాద్ యాదవ్





**వనపర్తి , సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** చిన్నంబావి మండల పరిధిలోని లక్ష్మి పల్లి గ్రామానికి చెందిన సంపంగి ఈశ్వర్ ఇంల్లు పిడుగుపాటుకు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి మండలాల మాజీ జడ్పిటిసి ఇటిక్యాల కృష్ణ ప్రసాద్ యాదవ్ ఉటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని చిన్నంబావి మండల ఎంపీడీవో మరియు తాహసిల్దార్ గారికి సమాచారం ఇచ్చి పిడుగుపాటుకు దెబ్బతిన్న సంపంగి ఈశ్వర్ ఇంటిని పరిశీలన చేశారు. విద్యుత్ వైర్లలో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇంట్లోని విద్యుత్ పరికరాలు, సామగ్రి దెబ్బతిన్నట్లు సమాచారం. అగ్ని ప్రమాదంతో ఇంట్లో కూలరు, వాషిం, ఇంట్లో విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు, గోడలు, కరెంటు వైర్లు బోర్డులు మీటరు పైభాగం తదితర ప్రాంతాలు పొగతో నల్లగా మారి పూర్తిగా దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే ఇంట్లోని సామగ్రి, ఇతర ఆస్తులకు నష్టం వాటి ల్లడంతో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత కుటుంబం తెలిపింది. పిడుగుపాటుకు ప్రాణనష్టం తప్పినా.. భారీ ఆస్తి నష్టం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ఘటనతో సంపంగి ఈశ్వర్ కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి ఘటనను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## రూ.1.35 లక్షలకు వినాయకుడి లడ్డూ

- కైవసం చేసుకున్న తూంకుంట జగదీశ్‌గౌడ్.. ఘనంగా గణేశుడి శోభాయాత్ర





**శామీర్‌పేట్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** దేవరయాంజాల్‌లో నిర్వహించిన గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన లడ్డూ వేలంపాటలో తూంకుంటకు చెందిన జగదీశ్‌గౌడ్ రూ.1.35 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ శామీర్‌పేట్ డివిజన్ దేవరయాంజాల్‌లో ఇగ్నైట్ వింగ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11 రోజులుగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.వినాయక విగ్రహాన్ని దాత కట్ట శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు సమకూర్చగా, అన్నప్రసాద కార్య క్రమాన్ని దాతలు మోటే బాలయ్య, గంధం ప్రవీణ్ కుటుంబ సభ్యులు నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం నిర్వహించిన లడ్డూ వేలం పాటలో పలువురు భక్తులు పాల్గొనగా జగదీశ్‌గౌడ్ రూ.1,35,000లకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం అతిథులు లడ్డూను ఆయనకు అందజేశారు.కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఇ.శ్రీనివాస్, డివిజన్ బీజేపీ నాయకులు పి.నర్సింహారెడ్డి తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.విగ్రహ దాత కట్ట శ్రీకాంత్‌రెడ్డి, అన్నప్రసాద దాతలు మోటే బాలయ్య, గంధం ప్రవీణ్ కుటుంబ సభ్యులతో పాటు పలువురు దాతలను ఇగ్నైట్ వింగ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు శాలువాలతో సత్కరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అల రించాయి.తదుపరి ఇగ్నైట్ వింగ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేశుడి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి గణనాథు డికి నిమజ్జనం నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.బాలయ్య, పి.సు ధాకర్‌రెడ్డి, ఎన్.శంకర్‌రెడ్డి, వి.రాజిరెడ్డి, జి.ప్రవీణ్‌గౌడ్, యం.లక్ష్మణ్, యం.శేఖర్‌గౌడ్, ఎం.రమేష్, ఎం.హుస్సేన్‌తో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## బీటీపీఎస్ గేటు వద్ద బీఆర్ఎస్ మహా ధర్నా!

- నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలి: మాజీ మంత్రి పువ్వాడ
- కాంగ్రెస్ కరెంటు కుట్రలను బయటపెడతాం: మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు






**పినపాక, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండల సరిహద్దులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు భారీ 'మహా ధర్నా' నిర్వహించారు. పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ హాజరయ్యారు. నియోజకవర్గ నలుమూలల నుంచి గులాబీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు భారీగా తరలి రావడంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి నేతృత్వంలో పోలీసులు భారీగా మోహరించ డంతో ధర్నా ప్రాంగణంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.అసమర్ధ పాలనతో విద్యుత్ రంగానికి గండి:ధర్నాను ఉద్దేశించి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలు పుతుంటే పోలీసులు అడ్డుకోవడం చూస్తుంటే.. మనం భారతదే శంలో ఉన్నామా లేక పాకిస్తాన్‌లో ఉన్నామా అనే అనుమానం కలుగుతోంది" అని మండిపడ్డారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సుదీర్ఘంగా పోరాడి కెసిఆర్ నాయకత్వంలో సాధించుకున్న తెలంగాణలో, పారిశ్రామికాభివృద్ధికి విద్యుత్ అత్యంత కీలకమని భావించి కేసీఆర్ ముందుచూపుతో బీటీపీఎస్‌ను నిర్మించారని గుర్తుచేశారు. ప్రభుత్వ రంగ సంస్థ 'బెల్' ద్వారా ఎంతో ప్రతి ష్టాత్మకంగా ఈ ప్లాంట్‌ను పూర్తి చేశారని తెలిపారు.అయితే, ప్రస్తుత రేవంత్ రెడ్డి అసమర్థత వల్ల బీటీపీఎస్‌లోని నాలుగు యూనిట్లకు గాను కేవలం రెండు యూనిట్లలోనే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండటం విచారకరమన్నారు. ప్లాంట్‌కు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడంలో సింగరేణి విఫలమవుతున్నా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను నిలిపివేసి ఆ సంస్థను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని ఆరోపించారు.ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న కాంగ్రెస్:ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకునే రేవంత్ రెడ్డి సర్కార్, శాంతి యుతంగా చేసే ధర్నాలకు కూడా అనుమతులు ఇవ్వకపోవడం నియంతృత్వ పాలనకు నిదర్శనమని విమర్శించారు. "అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని" అన్నట్లుగా రాష్ట్రంలో సరిపడా వనరులు ఉన్నా, వాటిని సరిగ్గా వినియోగించుకోలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. అసమర్థ పాలన అందిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిం చారు.ఈ మహా ధర్నా కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ పరి ధిలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు,, అభిమానులు విస్తృతంగా పాల్గొన్నారు.

## కొత్తచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలి :ముకుంద నాగేశ్వర్



**వికారాబాద్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా పరిగి: పట్టణం లోని కొత్తచెరువును సమగ్రంగా అభివృద్ధి చేసి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని తెలంగాణ ఉద్యమకా రుడు, బీజేపీ నాయకుడు ముకుంద నాగేశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.సుమారు 28 ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న చెరువులో కొద్దిపాటి ప్రాంతంలో మాత్రమే పనులు చేపట్టి అభివృద్ధి జరిగిందని ప్రకటించడం సరికాద న్నారు. చెరువు మొత్తం విస్తీర్ణాన్ని అభివృద్ధి చేసి, ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. బోటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు వచ్చే ఏడాది నుంచి వినాయక నిమజ్జన కార్యక్రమాలు నిర్వహిం చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.చెరువు పూర్తి నీటి మట్టం పరిధిలో ఇచ్చిన భూ లేఅవుట్లపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందులు పడుతున్న పేదలకు ప్రత్యామ్నాయ భూమి కేటా యించాలని కోరారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టి కొత్తచెరువును శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని ముకుంద నాగేశ్వర్ డిమాండ్ చేశారు.

## నాగర్‌కుంటలో సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన సదస్సు




**షాబాద్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** షాబాద్ మండలం నాగర్‌కుంట గ్రామంలో వెల్స్పన్ ఫౌండేషన్ సహకారంతో జన వికాస్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (JVRDS) ఆధ్వర్యంలో రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు.సేంద్రీయ వ్యవసాయ నిపుణులు జి. శశ్రీకాంత్ మాట్లాడుతూ జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, దశపర్ణి కషాయం తయారీ, వినియోగంపై రైతులకు వివరించారు. వీటి వినియోగంతో నేల సారం, సేంద్రియ కార్బన్ పెంచడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు.వెల్స్పన్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ పవన్ కుమార్ మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణ, సేంద్రీయ ఉత్పత్తులకు ఉన్న మార్కెట్ డిమాండ్, మెరుగైన ధరలు, మార్కెటింగ్ అవకాశాలు, రైతుల ఆదాయాభివృద్ధిపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లయ్య, వేల్స్పన్ కోఆర్డినేటర్ బద్రి, JVRDS CEO సంపత్ కుమార్, ఆర్గానిక్ ఎక్స్పర్ట్ శ్రీకాంత్, సిబ్బంది రామకృష్ణతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత యువతే వికసిత్ భారత్‌కు పునాది

- ఆరోగ్యంపై అవగాహన కల్పించిన 'మై హెల్త్–మై ప్రైడ్' కార్యక్రమం





**శామీర్‌పేట, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** మాదకద్ర వ్యాలకు యువత దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవా లని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా రెసిడె న్షియల్ డిగ్రీ కళాశాల జగ ద్గిరిగుట్ట ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ సూచించారు. మాద కద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్–100 వారాల సంకల్ప్ అభియాన్'లో భాగంగా 'మై హెల్త్–మై ప్రైడ్' ఇతి వృత్తంతో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.మై భారత్–ఎన్ఎస్ఎస్, ఉస్మానియా విశ్వవిద్యాలయం సహకారంతో నిర్వ హించిన కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.స్రవంతి, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ ఎం.గీత విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆరోగ్యం, పోషకాహారం, మాదకద్రవ్యాల దుష్ప్రభా వాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ప్ర భుత్వ ఆసుపత్రి ఘట్‌కేసర్‌కు చెందిన డాక్టర్ ప్రవీణ్, కీసర ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వ హించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక 'పోషకాహారం ప్రాముఖ్యత–మంచి ఆరోగ్యం' అంశంపై అవగాహన కల్పించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని వివరించారు.కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.అనిత ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఈ కార్యక్ర మాన్ని నిర్వహించింది. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని కార్యక్రమంలో సందేశమిచ్చారు. ఆరోగ్యవంతమైన యువత–మాదకద్రవ్యాల రహిత సమాజం–వికసిత్ భారత్ లక్ష్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించారు

## భగత్‌సింగ్‌నగర్‌లో ఘనంగా గణేష్ ఉత్సవాలు

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్





**డాక్టర్స్ కాలనీ, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-1లో చెలిమి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అసోసియేషన్ సభ్యులు శ్రీధర్ గౌడ్, శివ గౌడ్‌ల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న చెలిమి యూత్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు సంతోష్ కుమార్, యువ నాయకులు భార్గవ్ గౌడ్ తో పాటు అసోసియేషన్ సభ్యులు, స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



**వికారాబాద్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: గ్రామంలో బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామ పరిశుభ్రతకు సహకరించాలని లాల్‌సింగ్ తండా సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ గ్రామస్తులకు సూచించారు. ఇంటి వద్దే చెత్తను తడి, పొడిగా వేరు చేసి గ్రామపంచాయతీ చెత్త సేకరణ వాహనంలో వేయాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉండటంతో పాటు గ్రామాన్ని పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన గ్రామంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వరుణ్ కుమార్, వార్డు సభ్యులు, తండావాసులు పాల్గొన్నారు.

## డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత






**పినపాక , సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** జెన్కోకు బొగ్గు సరఫరా నిలిపివేత నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు పినపాక నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బి టి పి ఎస్ ప్రధాన ద్వారం వద్ద గురువారం నిర్వహించిన మహాధర్నా కార్యక్రమానికి డిఎస్పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 300 పోలీస్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేపట్టారు. మణుగూరు డివిజన్ లో ఏడూళ్ల బయ్యారం మణుగూరు పోలీస్ స్టేషన్ల సిఐ, ఎస్సైల తో పాటు వందలాది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.బీటీపీఎస్ ప్రధాన ద్వారం వద్ద పోలీస్ సిబ్బందిని పెద్ద సంఖ్యలో మోహరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు.ప్రధాన ద్వారం పరిసర ప్రాంతాల్లో పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టడంతో పాటు, అక్కడికి వచ్చే వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బందోబస్తును కట్టుదిట్టం చేశారు.పోలీస్ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు, సంబంధిత వర్గాలు పోలీసులకు సహకరించాలని కోరారు.బి ఆర్ ఎస్ మహా ధర్నా ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

## బీరం హర్షవర్ధన్‌రెడ్డిని పరామర్శించిన

- అయ్యవారిపల్లి బీఆర్ఎస్ నాయకులు
- బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు నాగర్ కర్నూల్ జిల్లా





**కొల్లాపూర్ , సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** పితృవియోగంతో బాధలో ఉన్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. ఈ సందర్భంగా సింగోటం గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీ.శే. బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. బీరం లక్ష్మారెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. "లక్ష్మారెడ్డి సేవలు చిరస్మరణీయం" బీరం లక్ష్మారెడ్డి మృతి కుటుంబానికే కాకుండా ఆయనతో అనుబంధం ఉన్న వారందరికీ తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అయ్యవారిపల్లి గ్రామ టిఆర్ఎస్ ప్రెసిడెంట్ నాగమద్దిలేటి, సీనియర్ నాయకులు శివశేఖర్, జక్కుల గణేష్, జక్కుల కృష్ణ, ఆర్ రాజు, నాగిరెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, రంజిత్ కుమార్ అయ్యవారిపల్లి గ్రామ బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళ లు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి కాంగ్రెస్ లక్ష్యం.

- పోష నే ఆరోగ్యానికి పునాది.
- అంగన్వాడి కేంద్రాలకు విద్యుత్, మౌలిక వసతులు కల్పిస్తాం.
- వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హామీ.







**ఏన్కూరు, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** పోషకాహారం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు 9వ పోషణ మాసం కార్యక్రమాలను ఏన్కూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 8 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహిస్తున్న పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఏన్కూరు రైతు వేదికలో కామేపల్లి ప్రాజెక్టు పరిధిలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక శ్రీమంతాలు, అక్షరాభ్యాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి నిర్వహించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమానికి హాజరైన గర్భిణీ మహిళలకు ఏన్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్ చీరలను అందజేశారు.తదుపరి ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు గర్భిణీ మహిళలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అక్షింతలతో గర్భిణులను ఆశీర్వదించి, తల్లి మరియు శిశువు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించి ఆశీర్వదించారు.అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా హాజరవుతున్న చిన్నారులను ప్రోత్సహించే ఉద్దేశంతో వారికి స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. పిల్లలు అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా హాజరై పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు.పౌష్టికాహార స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోషణ మాసం సందర్భంగా ఏన్కూరు మండలంలోని వివిధ అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసి ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. సుమారు 500 రకాల పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శనలో ఉంచారు. స్టాళ్లను ఎమ్మెల్యే రామదాసు నాయక్, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాళ్లలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పౌష్టికాహార పదార్థాలను ఎమ్మెల్యే రుచి చూసి వాటి తయారీ, పోషక విలువల గురించి అంగన్వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య ఆహారం, పోషక పదార్థాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారాన్ని ప్రతి కుటుంబంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోషకాహార వినియోగం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ప్రభుత్వ ఘనత అని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు.అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే రామదాసు నాయక్ చేతుల మీదుగా స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారి ఏ. ప్రమీల రాణి, కామేపల్లి సీడీపీఓ ఉమా, ఎంపీడీఓ భాగ్యశ్రీ, తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, సూపర్‌వైజర్లు భవాని, బక్కమ్మ, ఏన్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్, కాంగ్రెస్ నాయకులు మేడ ధర్మారావు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి సామేలు, వివిధ గ్రామాల సర్పంచులు సురేష్ నాయక్ , లక్ష్మ, చందమామ నరసింహారావు, మొగిలి నాగరాజు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది, గర్భిణులు, చిన్నారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.5 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



**శామీర్ పేట, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ రూ.5 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్మన్ జాము రవి ఆధ్వర్యంలో ఆయా వార్డుల్లో కార్యక్రమాలు నిర్వహించారు.మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో రూ.2.50 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు, 3వ వార్డులో రూ.2.50 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపేలా పనులు చేపడుతున్నట్లు తెలిపారు.మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతులను దశలవారీగా మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, మున్సిపల్ డీఈ స్ఫూర్తి, 8వ వార్డు కౌన్సిలర్ దోసకాయల లతా వెంకటేష్, పెద్దిరెడ్డి శ్రీలత వెంకటరెడ్డి, రాజీగళ్ల లతా భూపాల్ తదితరులు పాల్గొన్నారు.3వ వార్డులో కౌన్సిలర్ గొంది శ్రీవాణి వైద్యనాథ్, చిన్నలచ్చ సరిత శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు వెంకట నరసింహారెడ్డి, వెంకటేష్ షావుకారి, ముంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

# బి.ఎన్.రెడ్డి నగర్‌లో ఘనంగా 'శ్రీరస్తు శుభమస్తు' చీరల షోరూమ్ ప్రారంభం

- **ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ నటి నిధి అగర్వాల్**





**బి.యన్ రెడ్డి నగర్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** బి.ఎన్.రెడ్డి నగర్‌లోని సాగర్ కాంప్లెక్స్ బస్టాప్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ప్రముఖ వస్త్ర దుకాణం "శ్రీరస్తు శుభమస్తు సారీ స్టోర్" గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి టాలీవుడ్ ప్రముఖ హీరోయిన్ నిధి అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ఘనంగా ప్రారంభించారు. హీరోయిన్ రాకతో పరిసర ప్రాంతాల్లో కోలాహలం నెలకొంది; అభిమానులు, స్థానిక మహిళలు, కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రారంభోత్సవం అనంతరం ఆమె షోరూమ్‌లోని సరికొత్త చీరల కలెక్షన్లను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా సినీ నటి నిధి అగర్వాల్ మాట్లాడుతూ, "శ్రీరస్తు శుభమస్తు" చీరల షోరూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. భారతీయ సంప్రదాయంలో చీరకట్టుకు ఎంతో విశిష్టమైన స్థానం ఉందని, ఇక్కడి కలెక్షన్లలో ఆ సంప్రదాయంతో పాటు సరికొత్త ఆధునిక హంగులు స్పష్టంగా కనిపిస్తున్నాయని కొనియాడారు. పెళ్లిళ్లు, పూజలు, శుభకార్యాలతో పాటు రాబోయే దసరా, దీపావళి వంటి పండుగల కోసం ప్రతి మహిళ కోరుకునే అత్యుత్తమ డిజైన్లు, రంగులు, నాణ్యమైన చీరలు ఒకే చోట అందుబాటులో ఉండటం ఎంతో అభినందనీయమన్నారు.మహిళల అభిరుచులకు తగిన విధంగా విస్తృత శ్రేణిలో చీరలను ప్రవేశపెట్టిన నిర్వాహకులకు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ షోరూమ్ వినియోగదారుల ఆదరణతో దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అనంతరం షోరూమ్ నిర్వాహకులు మాట్లాడుతూ, మహిళల సరికొత్త ఫ్యాషన్, సంప్రదాయ అభిరుచులకు సరిపోయేలా అత్యున్నత నాణ్యతతో కూడిన విస్తృత శ్రేణి పట్టు, ఫ్యాన్సీ, డిజైనర్ చీరలను సరసమైన ధరలకే అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.వినియోగదారులకు మరింత ఉత్సాహం కలిగించేందుకు గ్రాండ్ ఓపెనింగ్ సందర్భంగా ప్రత్యేక లక్కీ డ్రా ఆఫర్లను ప్రవేశపెట్టినట్లు వివరించారు. రూ. 10,000 అంతకంటే ఎక్కువ విలువైన కొనుగోళ్లు చేసిన వినియోగదారులకు లక్కీ డ్రా ద్వారా బహుమతులు పొందే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతిగా 1 కేజీ వెండి, రెండో బహుమతిగా రూ. 50,000 విలువైన చీర, మూడో బహుమతిగా రూ. 25,000 విలువైన చీరలను దీపావళి పండుగ సందర్భంగా విజేతలను ఎంపిక చేసి అందజేయనున్నామని స్పష్టం చేశారు. పరిసర ప్రాంతాల ప్రజలు, మహిళలు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# గంజాయి నిందితుడి ఆస్తులు జప్తు

**పినపాక, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, ఉప్పాక వంతెన వద్ద 2025 ఆగస్టు 28న వాహన తనిఖీలను ఎస్సై సురేష్ సిబ్బంది సహకారంతో చేస్తుండగా, గంజాయి అక్రమ రవాణా చేస్తున్న పల్లపు రఘు (తండ్రి ఎల్లయ్య, 35 సంవత్సరాలు) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఈ కేసుకు సంబంధించి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి 24 సెప్టెంబరు 2026న పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌లో 2025 ఆగస్టు 28న నమోదైన నేర సంఖ్య 136/2025, ఎన్డీపీఎస్ చట్టం–1985లోని సెక్షన్లు 8(సి) తో పాటు 20(బి)(ii)(సి), 27(ఎ), 29 కింద నమోదైన కేసులో నిందితుడైన పల్లపు రఘు ఆస్తులపై, ఆర్థిక స్థితిగతులపై విచారణ నిర్వహించడం జరిగిందని ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. విచారణలో నిందితుడు గంజాయి అక్రమ రవాణా ద్వారా సంపాదించినట్లు గుర్తించిన రెండు కార్లు, ఒక మోటార్ సైకిల్, అతని భార్య బ్యాంకు ఖాతాను చెన్నైలోని సక్షమ అధికారి (కాంపిటెంట్ అథారిటీ) ద్వారా ఖాతా నిలిపివేత ఉత్తర్వులు పొంది, న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు జప్తు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జప్తు చేసిన ఆస్తుల విలువ సుమారు



రూ.21,15,907/–గా ఉందని అన్నారు.నిందితుడు పల్లపు రఘు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, ఇతని స్వస్థలం సిద్దిపేట జిల్లా, చిన్నకోడూర్ మండలం, మండేపల్లి కాగా, ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నివాసం ఉంటున్నాడని తెలిపారు.గంజాయి వంటి నేరాల ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి జప్తు చేసేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. నిందితుడిని అరెస్టు చేయడమే కాకుండా ఆస్తుల జప్తు వరకు సమర్థవంతంగా దర్యాప్తు చేసిన సీఐ వెంకటేశ్వరరావును, ఎస్ఐ సురేష్‌ను, స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అభినందించారు.

# క్రీడల్లో ప్రతిభను చాటాలి.. విద్యతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం

- **డిండి జడ్పీహెచ్ఎస్‌లో 70వ ఎస్జీఎఫ్ క్రీడా పోటీల ప్రారంభం- ఎమ్మెల్యే బాలు నాయక్**

**డిండి(గుండ్లపల్లి), సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని దేవరకొండ ఎమ్మెల్యే నెనావత్ బాలు నాయక్ అన్నారు. గురువారం డిండి జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన 70వ ఎస్జీఎఫ్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంలో పాఠశాల స్థాయి క్రీడా పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, జట్టుగా పనిచేసే మనస్తత్వం పెంపొందుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు.డిండి జడ్పీహెచ్ఎస్ వేదికగా జరుగుతున్న ఈ పోటీల్లో అండర్–14, అండర్–17 బాలబాలికల విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో తదితర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటుండగా, పోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు.కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక చింతన తోటే మానసిక ప్రశాంతత

- **మాజీ ఎంపీటీసీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య**



**షాబాద్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** ఆధ్యాత్మిక చింతన తోటే మానసిక ప్రశాంతత లభిస్తుందని ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య పేర్కొన్నారు. గురువారం ముద్దెంగూడ గ్రామంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని తెలిపారు. వినాయకుడి ఆశీస్సులతో అందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముద్దెంగూడ, సంకేపల్లిగూడ సర్పంచ్లు పర్వేద నర్సింహులు, కుమ్మరి లావణ్య, మాజీ ఎంపీపీ కూర వెంకటయ్య, మాజీ సర్పంచ్ సుదర్శన్, నాయకులు శేఖర్, శ్రీశైలం, శ్రీను, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**రూ. 2 లక్షలకు లడ్డూ ప్రసాదం కైవసం చేసుకున్న చెన్నయ్య**

వినాయకుడి లడ్డూ వేలం పాట నిర్వహించగా, రూ. 2 లక్షలకు స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య కైవసం చేసుకున్నారు. లడ్డూ ప్రసాదాన్ని స్వీకరించిన కుమ్మరి చెన్నయ్య ను నిర్వాహకులు పూలమాల, శాలువా తో సత్కరించి అభినందనలు తెలిపారు.

# గణపతి కీ ప్రత్యేక పూజలు

- *** మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్**



**మంథని / కమాన్ పూర్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం పేరపల్లి గ్రామంలో శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన శ్రీ గణనాథుని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ గురువారం ద ర్శించుకున్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మంథని నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.అనంతరం శ్రీ గణేష్ యూత్ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

# RTC కాలనీ MPPS పాఠశాలలో ప్రీ-ప్రైమరీ తరగతుల ప్రారంభం

- **8వ వార్డ్ కౌన్సిలర్ బి. ఎస్. సుధీర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం**




**షాద్‌నగర్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని RTC కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరం నుండి ప్రీ–ప్రైమరీ తరగతులను అధికారికంగా ప్రారంభించారు8వ వార్డ్ కౌన్సిలర్ శ్రీ బి. ఎస్. సుధీర్ ముఖ్య అతిథిగా హాజరై తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులకు బాలలకు అనుకూలమైన వాతావరణంలో ప్రాథమిక విద్యకు బలమైన పునాది ఏర్పడేందుకు ప్రభుత్వం ప్రీ–ప్రైమరీ విద్యను ప్రవేశపెట్టిందని అన్నారు. స్థానిక ప్రాంతంలోని చిన్నారులకు నాణ్యమైన విద్య అందించేందుకు పాఠశాల సిబ్బంది కృషి చేయాలని సూచించారు.పాఠశాలప్రధానోపాధ్యాయురాలు వి. రజిత మాట్లాడుతూ, ప్రీ–ప్రైమరీ తరగతుల ద్వారా చిన్నారులకు చిన్న వయస్సు నుంచే విద్యాభ్యాసంతో పాటు సామాజిక నైపుణ్యాలు, ప్రాథమిక అవగాహన మరియు అభ్యసన సామర్థ్యాలను పెంపొందించే అవకాశం లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వనజ, ధనలక్ష్మి , అమరావతి తదితరులు పాల్గొన్నారు

# ఎడతెరపిలేని వర్షంతో నీట మునిగిన పత్తి, మిరప పంటలు





**ఏన్కూర్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో పత్తి, మిరప పంటలు నీటమునిగాయి. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో వ్యవసాయ పొలాల్లో పెద్దఎత్తున నీరు నిలిచి పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి, మిరప సాగుకు ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల రూపంలో భారీగా పెట్టుబడులు పెట్టిన రైతులు.. పంట కీలక దశలో వర్షం కురవడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందేమోనని ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా పొలాల్లో నీరు బయటకు వెళ్లే మార్గం లేక వరుసల మధ్య నిలిచిపోవడంతో పంటల మొదళ్ల వద్ద అధిక తేమ ఏర్పడింది. వర్షం మరింత కొనసాగితే పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. నీటిముంపునకు గురైన పత్తి, మిరప పంటలను వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితిని అంచనా వేయాలని, నీటిని త్వరగా బయటకు పంపే మార్గాలపై సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. అలాగే పంటల్లో తెగుళ్లు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, నష్టం జరిగినట్లయితే సమగ్రంగా సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని రైతుల కోరుతున్నారు.

# ప్రీమెచ్యూర్ బేబీకి 21 రోజుల వైద్య సేవలు



**మంథని/పెద్దపల్లి, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** పెద్దపల్లి జిల్లా మైదం బండ గ్రామానికి చెందిన ఒక గర్భిణీకి నెలలు నిండక ముందే, ఎనిమిదవ నెలలో ప్రసవ నొప్పులు రావడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవం జరిగింది. ముందస్తు ప్రసవం కావడంతో తక్కువ బరువుతో జన్మించిన మగ శిశువును తదుపరి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రి, పెద్దపల్లిలోని ఎస్ఎన్సీ యూ / ఎన్ఐసీయూ విభాగానికి తీసుకువచ్చారు.శిశువు 1 కిలో 500 గ్రాముల బరువుతో జన్మించడంతో పాటు, ఊపిరితిత్తులు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల పుట్టిన వెంటనే శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. శిశువుకు తక్షణమే సీపాప్ పరికరం ద్వారా శ్వాస సహాయం అందిస్తూ ప్రత్యేక వైద్య చికిత్స ప్రారంభించడం జరిగింది. నాలుగు రోజుల పాటు సీపాప్ సహాయం అందించిన అనంతరం, పరిస్థితిని బట్టి నాసల్ ప్రాంగ్స్ ద్వారా ఆక్సిజన్ అందించారు. శిశువు ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడడంతో పాటు బరువు పెరగడం కోసం కంగారూ మదర్ కేర్ అందించారు. తల్లిపాలను అవసరమైన విధంగా అందిస్తూ శిశువు పోషణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.నెలలు నిండకముందే జన్మించడం మరియు తక్కువ బరువు కారణంగా తల్లిపాలు సరిగా జీర్ణం కాకపోవడంతో శిశువుకు ఇన్ఫెక్షన్ ఏర్పడి కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ సమయంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, శిశువుకు అవసరమైన మందులు, ఇంజెక్షన్లను అందుబాటులోకి తెప్పించి, సుమారు పది రోజుల పాటు ప్రత్యేక పర్యవేక్షణతో చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా శిశువుకు 21 రోజుల పాటు నిరంతరం సేవలందించి, ఆరోగ్యవంతంగా డిశ్చార్జ్ అయ్యేలా కృషి చేసిన ఎస్ ఎన్ సి యు పీడియాట్రిక్ వైద్య బృందం, డాక్టర్ అజయ్ కుమార్, డాక్టర్ రవీందర్,డాక్టర్ ప్రణీత్,డాక్టర్ ఉదయ్ కుమార్,డాక్టర్ సమత,డాక్టర్ రవి రాజా,డాక్టర్ అనుషా రెడ్డి లను మరియు నర్సింగ్ సిబ్బంది, సపోర్టింగ్ సిబ్బందిని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కే శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.జిల్లా ఆసుపత్రి, పెద్దపల్లిలో ముందస్తు ప్రసవాలు, తక్కువ బరువుతో జన్మించిన శిశువులకు అవసరమైన ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఎస్ ఎన్ సి యు ద్వారా సుమారుగా ఇప్పటి వరకు 1100 మంది శిశువులకు చికిత్స అందించడం జరిగిందని ఆసుపత్రి సూపరిండెంట్ తెలిపారు.

# రేపల్లెవాడ లో మహా అన్నదానం.



**ఏన్కూర్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండల పరిధి లోని రేపల్లెవాడ గ్రామంలో గణేష్ మండపాన్ని ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని రేపల్లెవాడ సర్పంచి అజ్మీర్ సురేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ... గ్రామంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో విఘ్నేశ్వరుడు ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అన్నదానం అనేది గొప్ప విషయమని ,ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు నిమ్మల నాగేశ్వరరావు , నరేంద్ర, నరసింహారావు , గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మధ్యతరగతికి ఆదాయం లేదు..

**వనపర్తి, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :**



ఉద్యోగాలు తగ్గుతున్నాయ్.. వేతనాలూ అంతంతేఅప్పులతో నడుస్తున్న ఆర్థిక బండిఖర్చులు పైపైకి.. ఆదాయంలో స్తబ్దతపెరుగుతున్న .సంపన్నుల సంపదప్రజా సేవలకు నై.. నగదు బదిలీలకు సైకేంద్రం తీరుతో దేశ ఆర్థిక విధానాలపై ఆందోళనమోడీ సర్కారు పాలనలో.ఆర్థిక వృద్ధి గణాంకాలు పేరుకే వెలిగిపోతున్నాయి. కానీ దేశంలోని సామాన్య భారతం పరిస్థితి మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. మధ్యతరగతి కుటుంబాల ఆదాయాలు అంతగా పెరగకపోగా.. విద్య, వైద్యం, రవాణా, రోజువారీ ఖర్చులు భారీగా పెరుగుతున్నాయి. దీంతో కుటుంబాల వినియోగాన్ని ఇప్పుడు ఆదాయం కాకుండా అప్పులే నడిపిస్తున్నాయి. మరోవైపు సంపన్న వర్గం సంపద వేగంగా పెరుగుతోంది. ప్రభుత్వ సేవల స్థానంలో నగదు బదిలీలపై ఆధారం పెరుగుతున్న తీరు.. దేశ ఆర్థిక విధానాలపై కీలక ప్రశ్నలను లేవనెత్తుతోంది.న్యూఢిల్లీ: మోడీ పాలనలో భారత మధ్యతరగతి ఆర్థిక పరిస్థితి క్రమంగా దిగజారిపోతోంది. ఒకప్పుడు ఉద్యోగం, వేతనం పెరిగితే కుటుంబ వినియోగం పెరిగేది. ఇప్పుడు ఆదాయం పెరగకపోయినా ఖర్చులు మాత్రం ఆగడం లేదు. ఫలితంగా రుణాలు తీసుకుని జీవన అవస రాలను కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇదే సమయంలో దేశంలో అత్యంత సంపన్న వర్గం సంపదను వేగంగా పెంచు కుంటూ అధిక విలువైన ఇండ్లు, కార్లు, ఇతర వస్తువుల కొనుగోళ్లను పెంచుతోంది. ఇది జీవన నాణ్యతా ప్రమాణాలపై ప్రశ్నలు సంధిస్తోంది.మధ్యతరగతి మార్కెట్ బలహీనంగత రెండు దశాబ్దాలుగా భారత ఆర్థిక వ్యవస్థకు మధ్యతరగతి వినియోగమే ప్రధాన వనరుగా నిలిచింది. షాంపూ, ప్యాకేజ్డ్ ఆహారం నుంచి ద్విచక్ర వాహనాలు, కార్లు, ఏసీల వరకు మార్కెట్ విస్తరించింది. ఇప్పు డు ఆ వినియోగ శక్తి మందగిస్తోంది. ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్( ఎఫ్ఎంసీజీ) ఉత్పత్తుల పరిమాణ విక్రయాల వృద్ధి 2011లో 11-12 శాతం ఉండగా.. 2026లో కేవలం మూడు శాతానికి పడిపోయింది. వినియోగ వస్తువుల వృద్ధి కూడా రెండంకెల స్థాయి నుంచి మధ్యస్థ అంకెలకు చేరింది.ఉద్యోగాలే కీలక సమస్య మోడీ పాలనలో దేశంలో నిరుద్యోగం తీవ్రంగా పెరిగింది. భారత్‌లో ఏటా సుమారు 80 లక్షల మంది కొత్తగా ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నారు. కానీ పూర్తి స్థాయి వైట్‌కాలర్ ఉద్యోగాలు అందుతున్నది చాలా కొద్దిమందికే. అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ పరిశోధన ప్రకారం నాలుగు శాతం మందికే పూర్తి స్థాయి వైట్‌కాలర్ ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఐటీ, బీపీఓ రంగాల్లో ఉద్యోగ ప్రకటనలు తగ్గడం, కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావం పెరగడం వల్ల వైట్‌కాలర్ ఉద్యోగాలపై ఒత్తిడి మరింత పెరుగుతోంది. ఇది కేంద్రంలోని మోడీ ప్రభుత్వ బలహీన విధానాల కారణంగా నేనని విశ్లేషకులు చెప్తున్నారు.సంపన్నుల ఎదుగుదలమరోవైపు దేశంలో కొత్త ధనిక వర్గం వేగంగా ఎదుగుతోంది. చిన్న, మధ్య తరహా నగరాల నుంచి వచ్చిన వ్యాపారవేత్తలు సాంకేతికత ఆధారంగా భారీగా సంపద సృష్టిస్తున్నారు. దాని ప్రభావం రియల్ ఎస్టేట్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. రూ.1.5 కోట్లలోపు ఇండ్ల వాటా 2022 తొలి త్రైమాసికంలో 85 శాతం ఉండగా.. 2026 తొలి త్రైమాసికానికి 47 శాతానికి పడిపోయింది. రూ.1.5 కోట్ల నుంచి రూ.4 కోట్ల మధ్య ఇండ్ల వాటా మాత్రం 14 శాతం నుంచి 44 శాతానికి పెరిగింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలనలో సంపన్నుల ఎదుగుదల ఏ విధంగా జరుగుతోందో ఇది తెలియజేస్తోంది. ప్రయివేట్ తుది వినియోగ వ్యయం 2025 ఆర్థిక సంవత్సరంలోని 5.8 శాతం నుంచి 2026లో 7.7 శాతానికి పెరిగింది. 2026-27 తొలి త్రైమాసికంలో ఇది 7.1 శాతంగా నమోదైంది. అయితే ఈ పెరుగు దల వెనుక కుటుంబ ఆదాయాల కంటే రుణాల విస్తరణ ముఖ్యమైన కారణం గా మారింది. వాహన రుణాలు 18.8 శాతం పెరగగా.. బంగారు రుణాలు ఏకంగా 88.1 శాతం పెరిగాయి. అదే సమయంలో క్రెడిట్ కార్డు బకాయిల వృద్ధి 2.3 శాతానికి, వినియోగ వస్తువుల రుణాల వృద్ధి 0.4 శాతానికి తగ్గింది. అంటే ప్రజలు ఖర్చు చేయడం ఆపలేదు.. కానీ ఆ ఖర్చుకు డబ్బు ఎక్కడి నుంచి వస్తోందన్నదే అసలు ప్రశ్న.నగదు బదిలీల వైపు ప్రభుత్వాలుప్రభుత్వాల ఆర్థిక పరిస్థితిపైనా ఒత్తిడి పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ వడ్డీ చెల్లింపులు 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.14.04 లక్షల కోట్లకు చేరాయి. ప్రభుత్వ ఆదాయంలో సింహ భాగం వడ్డీ చెల్లింపులకే వెళ్తున్న నేపథ్యంలో ప్రజా సేవలపై ఖర్చు చేయడం తగ్గుతోంది. మరోవైపు మహిళలు, తక్కువ ఆదాయ వర్గాలకు నగదు బదిలీ చేసే పథకాలు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. తక్షణ ఆర్థిక సహాయం అందించడం ద్వారా పేద కుటుంబాలకు తాత్కాలికంగా ఉపశమనం లభిస్తున్నా.. అది దీర్ఘకాలంలో ప్రతికూల ప్రభావాన్ని చూపే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ఇక ప్రజలకు కీలకమైన ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, ఉపాధి అవకాశాలను బలోపేతం చేయడంలో మాత్రం మోడీ సర్కారు అంతగా శ్రద్ధ చూపడం లేదు.ఎవరి చేతుల్లో వినియోగం?భారత వినియోగ వ్యవస్థలో ఇప్పుడు స్పష్టమైన విభజన కనిపిస్తోంది. పైస్థాయిలో సంపన్నుల ఖర్చులు పెరుగుతున్నాయి. ఇటు మధ్యతరగతి రుణాలపై ఆధారపడుతోంది. దిగువ ఆదాయ వర్గాలకు నగదు బదిలీలు ఆధారంగా మారుతున్నాయి. ఉద్యోగాలు, వేతనాలు, ప్రజా సేవలు బలపడకుండా వినియోగ వృద్ధి కొనసాగితే.. ఆ వృద్ధి స్థిరమైందని చెప్పలేమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.అప్పులతో వినియోగంమధ్యతరగతి కుటుంబాల ఖర్చులు మాత్రం ఆదాయంతో సరిపోలడం లేదు. విద్య, వైద్యం, రవాణా, ఇల్లు, రోజువారీ అవసరాల ఖర్చులు పెరుగుతున్నాయి. దానికి అనుగుణంగా ఆదాయం అంతగా పెరగడం లేదు. దీంతో కుటుంబాలు రుణాల కోసం ఎదురుచూస్తున్నాయి. అప్పుల మీద ఆధారపడటంతో భవిష్యత్తు సంక్లిష్టమవుతోంది. దేశంలో గృహ రుణాలను మినహాయించిన కుటుంబ రుణభారం జీడీపీలో ప్రపంచంలోనే అత్యధిక స్థాయికి చేరిందని గణాంకాలు సూచిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

# ఘనంగా గణనాథునికి వీడ్కోలు

- భక్తిశ్రద్ధలతో ముగిసిన శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలు
- కోలాటాలు, నృత్యాలతో సందడిగా సాగిన గణనాథుని శోభాయాత్ర







**బోనకల్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** బోనకల్ గ్రామంలోని జగ్గయ్యపేట రోడ్డులో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు గణనాథునికి ప్రత్యేక పూజలు, అలంకరణలు, నైవేద్యాలు, హారతులతో ఉత్సవాలను నిర్వహించిన నిర్వాహకులు చివరి రోజున గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు.

**తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు**

వినాయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించిన గణనాథునికి తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలు, అలంకరణలతో ప్రత్యేకంగా ముస్తాబు చేసి భక్తులను ఆకట్టుకున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించడంతో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గణనాథుని దర్శించుకున్నారు.ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ భక్తులకు వివిధ రకాల నైవేద్యాలను సమర్పించి అనంతరం ప్రసాదాలను పంపిణీ చేశారు. చిన్నారులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొనడంతో జగ్గయ్యపేట రోడ్డులో తొమ్మిది రోజుల పాటు సందడి నెలకొంది.

**అంగరంగ వైభవంగా నిమజ్జన శోభాయాత్ర**

బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గణనాథుని ప్రతిమను ఉంచి బోనకల్ గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా శోభాయాత్ర నిర్వహించారు.శోభాయాత్రలో యువకులు ఉత్సాహంగా పాల్గొనగా, మహిళలు సైతం పెద్ద సంఖ్యలో హాజరై కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు. 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో గ్రామ పురవీధులు మార్మోగాయి. భక్తులు గణనాథునికి తుది వీడ్కోలు పలుకుతూ భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

**భక్తులకు ప్రసాదాల పంపిణీ**

శోభాయాత్ర సందర్భంగా శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. గణనాథుని ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ఆకాంక్షించారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గ్రామ ప్రజలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

**ఉత్సవ కమిటీ సభ్యుల ప్రత్యేక కృషి**

ఉత్సవాల నిర్వహణలో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవహరించారు. పూజా కార్యక్రమాలు, అలంకరణలు, ప్రసాదాల పంపిణీతో పాటు నిమజ్జన శోభాయాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు సభ్యులు కృషి చేశారు. యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి.ఈ కార్యక్రమంలో కలవల వెంకట సుబ్బారావు, కలవల బాబు, ఇమ్మడిశెట్టి రాము, అమరేసి సాయికుమార్, రామారావు మేస్త్రి, కృష్ణ మేస్త్రి, బంధం దుర్గారావు, ఎలక్ట్రీషన్ సాయి, గంగాధరి కృష్ణ, పాండురంగారావు, నరేందర్, ఫ్యాన్సీ షాప్ సాయి, బ్రహ్మంజనేయులు, కూడుపుగంటి కృష్ణ, కోణతాలపల్లి నాగేశ్వరరావు, జిత్ కుమార్ తదితరులతో పాటు మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

## వివేకానంద నగర్ గణనాథుని దర్శించుకున్న మధు యాష్కి గౌడ్

**గడ్డి అన్నారం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** వివేకానంద నగర్ ఫ్రెండ్షిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్గనైజర్ మధ్యలో సునీల్ బాబు ప్రతిష్ఠించిన గణనాథుని మధు యాష్కి గౌడ్ అన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతన్నలకు పంటలు పండాలని, వారి కష్టానికి తగిన ఫలితం దక్కాలని విఘ్నేశ్వరుని ప్రార్థించారు.మధు యాష్కి గౌడ్,ఏఐపీసీ చైర్మన్ మాజీ పార్లమెంట్ సభ్యులుఎల్బీన గర్ నియోజకవర్గం ఇంచార్జ్, మద్దెల సునీల్ బాబు అధ్యక్షులు, గడ్డి అన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇట్టి కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు మర్రి శశికళ, బద్దుల వేణుగోపాల్ యాదవ్, మాజీ అధ్యక్షులు గడ్డి అన్నారం డివిజన్ కందికంటి ప్రేమ్ నాథ్ గౌడ్, మాజీ కౌన్సిలర్, గండి జగన్ యాదవ్, టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్యదర్శి శాంతి ఎస్సీ సెల్ చైర్మన్ గడ్డిఅన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూడి గోవర్ధన్, సురేష్ నాయుడు, గండి జ్యోతి ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.



## పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యం

- పారదర్శకంగానే ఇండ్ల ఎంపిక ప్రక్రియ
- లాటరీ ద్వారా 214 మందికి గృహాలు
- అణగారిన వర్గాలకు సముచిత ప్రాధాన్యం
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు



**ఖమ్మం, కొత్తగూడెం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 29 డివిజన్లకు, 36 మున్సిపల్ వార్డులకు చెందిన ఇండ్లు లేని నిరుపేదలకు లాటరీ పద్ధతిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించే ప్రక్రియ గురువారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాతకొత్తగూడెంలో జి–2 నిర్మాణ విధానంలో 23 బ్లాకులుగా మొత్తం 828 ఇండ్లు నిర్మాణదశలో ఉన్నాయని, గతంలో కొందరిని లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక జరిగిందని గుర్తుచేశారు. మిగిలిపోయిన 214 మంది అర్హులైన పేదలను ఎలాంటి పక్షపాతం లేకుండా పూర్తి పారదర్శకంగా ప్రజా సమక్షంలో లాటరీ తీసి కేటాయించినట్లు తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామని, మొత్తం 214 ఇండ్లలో 70 ఇండ్లను ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగులకు ప్రత్యేకంగా కేటాయించామని పేర్కొన్నారు. మిగిలిన 144 ఇండ్లను ఓపెన్ కేటగిరీ కింద పూర్తి నిష్పక్షపాతంగా లబ్దిదారులకు అందజేశామన్నారు. గూడు లేని నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే బాధ్యతగా పనిచేస్తున్నామని, లాటరీలో ఇండ్లు రానివారికి, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద కుటుంబానికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాపాషా, మేయర్ మూడ్ గణేష్, ప్రజా ప్రతినిధులు వీరబాబు, కొత్వాల శ్రీనివాసరావు, మండే హన్మంతరావు, లలిత కుమారి, కమిషనర్ సుజాత, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రచించాలి

- మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచాలి
- ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర పురోగతి
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ఖమ్మం, చుంచుపల్లి, కొత్తగూడెం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** గ్రామాల సమగ్ర అభివృద్ధికి క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండల పరిధిలోని ఎన్‌కే నగర్ కమ్మ సత్రంలో చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు మండలాల పంచాయతీ సర్పంచులు, సెక్రటరీలు, సిబ్బందికి 'విబి–జి రామ్–జి' పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు మెరుగుపడే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. శ్రమతో కూడిన పనులు చేసే కుటుంబాలకు 125 రోజుల పనిదినాలు కల్పించేలా, 375 రకాల అభివృద్ధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో నీటి భద్రత, మౌలిక వసతులు, స్థిరమైన జీవనోపాధి కల్పన అనే మూడు అంశాలపై ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అమలు చేసే ప్రతి కార్యక్రమం అర్హులకు చేరేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, వివిధ గ్రామాల సర్పంచులు, టెక్నికల్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్.ఎల్.ఎమ్ ఫలితాలలో భానుచందర్ కు అత్యున్నత శ్రేణి ప్రతిభ



**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** ఖమ్మం నగరానికి చెందిన హైకోర్టు అడ్వకేట్ నాళ్ల భానుచందర్ గురువారం ప్రకటించిన ఎల్.ఎల్.ఎమ్ వార్షిక పరీక్షా ఫలితాలలో అత్యున్నతశ్రేణి ప్రతిభను కనబరిచారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్.ఎల్.ఎమ్ పూర్తిచేసిన నాళ్ళ భానుచందర్ వివిధ న్యాయ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ఉత్తమ శ్రేణి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. నాళ్ల భానుచందర్ ప్రస్తుతం హైదరాబాదులోని హైకోర్టులో అడ్వకేట్ గా బాధ్యతలు నిర్వహిస్తూనే ఖమ్మం న్యాయస్థానంలో పలు క్లిష్టతరమైన కేసులలో నైపుణ్యంతో విజయవంతం చేయడంతో ఈ యువ న్యాయవాదిని సీనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపిన సందర్భాలు ఎన్నెన్నో ఉన్నాయి. నాళ్ల భానుచందర్ ఐదవ తరగతి వరకు ఇల్లెందు మండలం మాణిక్యారం గ్రామంలో విద్యను అభ్యసించగా, ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు ఖమ్మం మౌంట్ ఫోర్ట్ హైస్కూల్లో చదివారు. ఇంటర్ విద్యను ఖమ్మంలోని నయాబజార్ జూనియర్ కళాశాలలో, డిగ్రీ విద్యను ఎస్సా ఆ ర్ అండ్ బిజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో , పీజీ ఎంఏ ఇంగ్లీష్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఖమ్మం మానేరు లా కళాశాలలో ఎల్.ఎల్.బి పూర్తి చేసి, ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్.ఎల్.ఎమ్ కోర్సును పూర్తిచేసి అత్యున్నత శ్రేణి ఫలితాలతో సత్తా చాటారు. భానుచందర్ పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో , విద్యాసేవ కార్యక్రమాలలో సేవలందిస్తూ పలు వైద్య శిబిరాలను నిర్వహించి అవసరమైన వారికి న్యాయ సలహాలను అందించి పూర్తి న్యాయం జరిగేలా అండగా నిలుస్తున్నారు. అత్యున్నత శ్రేణిలో ఎల్.ఎల్ ఎం లో ఉత్తీర్ణులైన హైకోర్టు యువ అడ్వకేట్ నాళ్ల భానుచందర్ కు తల్లిదండ్రులు మల్లికాంబ, శ్యాంసుందర్, చెల్లి ,బావ భారతి, సాంబశివుడు, తమ్ముడు భార్గవ్ , న్యాయవాదులు , విద్యావంతులు గురువారం అభినందనలు తెలిపారు.

## రిచ్ లుక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు





**మంథని/పెద్దపల్లి, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలో సిద్దిపల్లి గ్రామానికి చెందిన బిళ్ల హరీష్ దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన రిచ్ లుక్స్ కిడ్స్ మెన్స్ వేర్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు పాల్గొని షాప్‌ను ప్రారంభించి, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీను బాబు మాట్లాడుతు. . . వ్యాపార ం అభివృద్ధి చెందుతూ మంచి పేరు సంపాదించాలని, వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందిస్తూ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మిలిటరీ మద్యాన్ని బ్లాక్ మార్కెట్ లో విక్రయిస్తున్న మాజీ సైనికుడిని అరెస్ట్ చేసిన మల్కాజిగిరి ఎక్సయిజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు



**ఘట్కేసర్ , సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** తన కోటాలో వచ్చిన మిలిటరీ మద్యాన్ని బ్లాక్ మార్కెట్ లో విక్రయిస్తున్న మాజీ సైనికుడిని మల్కాజిగిరి ఎక్సయిజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా మార్కాపురం కు చెందిన మాజీ సైనికుడు బైరు వెంకటేశ్వర్లు మేడిపల్లి మండలం పర్వతాపూర్ లక్ష్మీనగర్ లో నివాసం ఉంటున్నాడు. కాగా తన కోటాలో వచ్చే మిలిటరీ మద్యాన్ని ఇతరులకు అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు మల్కాజిగిరి ఎన్ఫోర్స్మెంట్ ట్రైని ఏఈఎస్ ముస్తఫా సిద్ధిక్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లు ఇంటి పై దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా పదకొండున్నర లీటర్ల పదిహేను కర్ణాటక డిఫన్స్ లిక్కర్ ఫుల్ బాటిల్లను స్వాధీనం చేసుకుని ఘట్కేసర్ ఎక్సయిజ్ సీఐ ప్రసాద్ కు అప్పగించారు. నిందితుడు వెంకటేశ్వర్లు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఘట్కేసర్ ఎక్సయిజ్ సీఐ ప్రసాద్ తెలిపారు.

## చందనవెల్లిలో మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ ప్రారంభం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కాలే యాదయ్య చేతుల మీదుగా ప్రారంభం



**షాద్‌నగర్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** షాబాద్ మండలం చందనవెల్లి పారిశ్రామిక వాడ లో ఏర్పాటు చేసిన మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ చందనవెల్లి పారిశ్రామికవాడ అభివృద్ధికి భూములు అందించి, సహకరించిన రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణలో అత్యాధునిక డేటా సెంటర్ల ఏర్పాటుతో హైదరాబాద్‌ను గ్లోబల్ క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని 2029 నాటికి 5 గిగావాట్లకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.డేటా సెంటర్ల ఏర్పాటుతో ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ టెక్నాలజీతో పాటు అనుబంధ రంగాల్లో పెట్టుబడులు పెరిగి, స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. యువతకు ఆధునిక సాంకేతిక రంగాల్లో నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.తెలంగాణను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దుతూ, హైదరాబాద్‌ను దేశంలోనే కీలక డేటా సెంటర్ హబ్‌గా అభివృద్ధి చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న పారిశ్రామిక సంస్థలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని అన్నారు.మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ ఏర్పాటుతో చందనవెల్లి పారిశ్రామికవాడకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో పాటు, ఈ ప్రాంతంలో మౌలిక వసతులు మరియు పారిశ్రామిక కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పిసరి సురేందర్ రెడ్డి గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, సర్పంచులు నవనీత స్వామి, కర్రోళ్ల శాంతమ్మ ,డీసీపీ యోగేష్ గౌతమ్, ఆర్డీఓ పార్థసింహారెడ్డి, తహసిల్దార్ అన్వర్,ఎసిపి కిషన్ తదితరులు పాల్గొన్నారు

నేటి శుభోదయ
శుక్రవారం | హైదరాబాద్
25 - 09 - 2026
www.netisubhodaya.com


# అన్నదానం ప్రారంభం



**ఖమ్మం, వైరా, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా, వైరా మున్సిపాలిటీ పరిధిలో 12వ వార్డు నందు శ్రీ శక్తి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రావు, వైరా ఎస్సై పుష్పాల రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ లు ప్రారంభించారు. అంతకుముందు గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . అనంతరం వైరా ఎస్సై పుష్పాల రామారావును, కమిషనర్ రామచంద్రావును కమిటీ సభ్యులు ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కట్ల నాగరాజు, కాంపౌండ్ శేషగిరి, రేచర్ల నాగేశ్వరరావు, రేచర్ల రామారావు, రేచర్ల సైదులు, చెరుకూరి కిరణ్, పోలూరి సైదులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వైరా పై ప్రతేకంగా దృష్టి సారించాలి : పురపాలక యంత్రాంగం ఆదేశాలు జారీ





**ఖమ్మం, వైరా, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంపై పురపాలక యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. వర్షాల వల్ల వార్డులలో తలెత్తిన డ్రైనేజీ సమస్యలు, మురుగునీటి ప్రవాహ పరిస్థితిని గురువారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులలో మురుగునీరు నిలిచిపోకుండా తక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. స్థానికంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఆయా వార్డుల కౌన్సిలర్లకు సమాచారం అందించాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది అంతా ప్రజలకు అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు.ఒకవైపు వినాయక నిమజ్జన కార్యక్రమాలు, మరొకవైపు వర్షాల నేపథ్యంలో పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా మున్సిపాలిటీ కార్మికులు అనునిత్యం అందుబాటులో ఉండి విధులు నిర్వర్తిస్తున్నారని కమిషనర్, వైస్ చైర్మన్ వివరించారు. ప్రజలు కూడా పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని వారు కోరారు.

# పాలెపు ఆధ్వర్యంలో ఘనంగా నిమజ్జన కార్యక్రమం





**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల 44 వ డివిజన్ లో వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించి, అనంతరం డివిజన్ మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమాని ఘనంగా నిర్వహించారు. తొలుత వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించిన తర్వాత లడ్డు పాట నిర్వహించడం జరిగింది. ఈ పాటను పాలెపు విజయ వెంకటరమణ తనయుడు దక్కించుకున్నారు. అనంతరం డివిజన్ మొత్తం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను గంగ వడికి తరలించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పాలెపు వెంకటరమణ, డివిజన్ మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ, వారి కుటుంబ సభ్యులు, డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్‌కు రోడ్డు ప్రమాదం

- **లారీ ఢీకొని పోలీస్ వాహనం ధ్వంసం**
- **ఎస్సైతో పాటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు**




**ఖమ్మం, తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** కూచిపూడి జగదీష్ రోడ్డు ప్రమాదానికి గురైనట్లు సమాచారం. వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో విధులు నిర్వహించిన అనంతరం పిండిప్రోలు గ్రామం నుంచి తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్‌కు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.గురువారం అర్ధరాత్రి సుమారు ఒంటి గంట సమయంలో భవాని హోటల్ సమీపంలో ఎస్సై జగదీష్, ఆయన డ్రైవర్ పోలీస్ వాహనంలో ప్రయాణిస్తుండగా లారీ ఢీకొన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో పోలీస్ వాహనం తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.ప్రమాదంలో ఎస్సై కూచిపూడి జగదీష్‌తో పాటు డ్రైవర్ కొత్తపల్లి రాకేష్‌కు కూడా తీవ్రమైన గాయాలైనట్లు సమాచారం. కాకరవాయి గ్రామానికి చెందిన రాకేష్‌కు తలకు బలమైన గాయాలు అయినట్లు తెలుస్తోంది.ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుమలాయపాలెం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని స్తంభాద్రి ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది.అయితే ఎస్సై జగదీష్, డ్రైవర్ రాకేష్ ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గల కారణాలు, లారీ వివరాలు, గాయాల తీవ్రతపై అధికారిక సమాచారం రావాల్సి ఉంది.

# రోడ్డు ప్రమాదంలో తిరుమలాయపాలెం ఎస్సైకు తీవ్ర గాయాలు

- **క్షతగాత్రులను పరామర్శించిన తుంబూరు దయాకర్ రెడ్డి**



**ఖమ్మం, తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** వినాయక నిమజ్జనం సందర్భంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్‌తో పాటు డ్రైవర్ కొత్తపల్లి రాకేష్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం గురువారం రాత్రి ఒంటిగంట సమయంలో ఖమ్మం–వరంగల్ జాతీయ రహదారిపై తిరుమలాయపాలెం పరిసర ప్రాంతంలోని భవాని హోటల్ సమీపంలో చోటుచేసుకుంది.పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసు వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ఎస్సై జగదీష్, ప్రైవేట్ డ్రైవర్ రాకేష్ గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను ఖమ్మం పట్టణంలోని స్తంభాద్రి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎస్సై జగదీష్‌కు గాయాలు కాగా, డ్రైవర్ రాకేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.ప్రమాద విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, స్తంభాద్రి ఆసుపత్రికి చేరుకుని ఎస్సై జగదీష్, డ్రైవర్ రాకేష్‌లను పరామర్శించారు.అనంతరం వైద్యులతో మాట్లాడి క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని కోరారు. ముఖ్యంగా డ్రైవర్ రాకేష్ పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకున్న తుంబూరు దయాకర్ రెడ్డి, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం రాకేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రాకేష్ కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తామని తెలిపారు.

# మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ సందర్శించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు బృందం






**ఖమ్మం, మణుగూరు, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాతరోజుల కరెంట్ కోతలు, రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయి అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో రైతులకు, గృహ వినియోగదారులకు, పారిశ్రామిక అవసరాలకు 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ పాతరోజుల కరెంట్ కోతలు, విద్యుత్ కష్టాలు ప్రారంభమయ్యాయి.రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 8 గంటల కరెంట్ మాత్రమే అదీ విడతల వారీగా ఇస్తోంది. ఎనిమిది గంటల పాటు అందరూ ఒకేసారి సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై ఆధారపడి మోటార్లు ఆన్ చేయడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయి, లో–వోల్టేజీతో మోటార్లు కాలిపోతున్నాయి. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చుకోవడానికి రైతులు మళ్లీ తమ సొంత డబ్బులు వేసుకోవాల్సిన దుస్థితి దాపురించింది. తెలంగాణలోని థర్మల్ పవర్ ప్లాంట్లకు నాణ్యమైన బొగ్గు సరఫరా కావాలంటే సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన బాకీలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలి. చెల్లింపులు చేయకపోవడం, నిర్వహణా లోపాల వల్ల విద్యుత్ ఉత్పాదన దెబ్బతింటోంది. సింగరేణిలో ప్రతిరోజూ ఒక స్కామ్, కోల్ కుంభకోణాలు జరుగుతున్నాయి. కేసీఆర్ హయాంలో రాష్ట్ర విద్యుత్ సామర్థ్యాన్ని 19,000 మెగావాట్లకు పెంచి, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లను అద్భుతంగా నిర్మించి "వడ్డించిన విస్తరి"లా కాంగ్రెస్‌కు అప్పగిస్తే, వారు మూడేళ్లలోనే విద్యుత్ వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. హైడల్ పవర్ ప్లాంట్లలో నీళ్లు లేక విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. థర్మల్ ప్లాంట్లకు బొగ్గు సరఫరా సరిగ్గా లేక విద్యుత్ కొరత ఏర్పడుతోంది. కేటీఆర్ పిలుపు మేరకు విద్యుత్ ప్లాంట్ల పరిస్థితిని తెలుసుకోవడానికి భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పరిశీలించడానికి వస్తే, అధికారులు లోపలికి అనుమతించకుండా ఆంక్షలు విధించడం శోచనీయం. 4 యూనిట్లలో 2 యూనిట్లు పనిచేయడం లేదని అధికారులే చెబుతున్నారు, ఆ పరిస్థితిని నిరసిస్తున్నాం. రైతాంగానికి, గృహాలకు, పరిశ్రమలకు తక్షణమే నాణ్యమైన 24 గంటల విద్యుత్‌ను పునరుద్ధరించాలి. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలి. పవర్ ప్లాంట్లకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేసి విద్యుత్ ఉత్పాదన పూర్తి స్థాయిలో సాగేలా చూడాలి.కాలిపోయిన రైతు ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లకు తక్షణ ఉచిత రిపేర్లు, మార్పిడి చేపట్టి వ్యవసాయాన్ని ఆదుకోవాలి.

# సర్ పేరుతో ఓట్ల తొలగింపు

- ఈసీ బీజేపీకి తొత్తుగా మారింది
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఫైర్
- ఎన్నికల కమిషన్ తీరుపై ఘాటు విమర్శలు
- జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్



**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** కేంద్ర ఎన్నికల సంఘం సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పేరుతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఘాటుగా విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈసీ తాజాగా సుప్రీంకోర్టులో వేసిన అఫిడవిట్ పూర్తిగా అసమంజసంగా ఉందన్నారు. "అనుమానాలను స్వీకరించం, ఆ అంశాన్ని కమిషన్ పరిశీలిస్తుంది అని క్యాబినెట్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లామని సమాధానం చెప్పడం సిగ్గుచేటు. 10 ఏళ్లలో 14 సార్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఇలా చట్టవిరుద్ధంగా చర్యలు చేపట్టారని వారిలో ఆరోపించారు. 2025 జూన్ నుండి ఇప్పటిదాకా సర్ లో భాగంగా 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 13 కోట్లకు పైగా ఓట్లను తొలగించారు. ఇది ఓట్ల తొలగింపు కాదు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే" అని ఆయన మండిపడ్డారు. ఈసీ తీరుపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోందని, అందుకే ఢిల్లీలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నిరసన తెలిపారని గుర్తుచేశారు.--- బీజేపీతో కలిసి ఓట్ల చోరీకి కుట్ర "బీజేపీ, ఆరెస్సెస్, ఈసీలు కలిసి ఓట్ల చోరీ ద్వారా దేశద్రోహ చర్యకు పాల్పడుతున్నాయి. బీహార్, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో నిరసనలు చిన ఆసాంతం ఎన్నికలను రద్దు చేసి మళ్ళీ బ్యాలెట్ పేపర్ తో ఎన్నికలు నిర్వహించాలి. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి, ఆయనను అరెస్టు చేయాలి. గతేదాది కాలంలో ఈ నిర్ణయాలను పూర్తి కమిషన్ ఏకగ్రీవంగా తీసుకోలేదు, కేవలం కొందరు అధికారుల ఇష్టానుసారంగా జరుగుతోంది" అని ఆయన ఆరోపించారు.కొత్త ఓటరు అంటే ఎవరో తెలియదని, తల్లిదండ్రులు, తాతల పేర్లను నింపడానికి తీసుకొచ్చిన పారంఫారం మార్పులు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, చట్టాల్లో మార్పులు చేయకుండా ఫారం -6 ను మార్చలేరని అన్నారు. ఈసీ తీరు బ్రిటిష్ పాలనను తలపిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ వీధి పోరాటం చేస్తుందని, దేశ ప్రజలు ఎప్పుడో బీ జె పి పార్టీని అభిశంసించారని, ఈ పోరాటం ఆగదని జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ స్పష్టం చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రోగి కేంద్రీకృత నిర్ధారణ సేవలు

- పాథాలజీ విభాగం ద్వారా వేలాది మందికి సకాలంలో వైద్య నిర్ధారణ
- కేన్సర్ స్క్రీనింగ్ నుంచి హిమోగ్లోబిన్ సంబంధిత వ్యాధుల గుర్తింపు వరకు విస్తృత సేవలు





**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** హైదరాబాద్‌లో భవనాల భద్రతపై ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. గోపన్‌పల్లి, ఎన్‌టీఆర్ నగర్‌లో 50 చదరపు గజాల స్థలంలో నిర్మించిన నాలుగు అంతస్తుల భవనం శుక్రవారం ఒక్కసారిగా ఒక వైపుకు వాలిపోయింది.భవనం వాలిపోవడంతో భయాందోళనకు గురైన ప్రజలు వెంటనే బయటకు వచ్చారు. అధికారులు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించి, చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్ అధికారులు భవనాన్ని పరిశీలిస్తున్నారు. పునాది బలహీనత, నిర్మాణ లోపాలు లేదా అనుమతులు లేకుండా చేసిన మార్పుల వల్ల ఈ పరిస్థితి వచ్చిందా అనే విషయాన్ని పరిశీలిస్తున్నారు.గచ్చిబౌలి, అంజయ్యనగర్‌లో అక్రమంగా నిర్మించిన ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు మృతి చెందిన ఘటన జరిగి కొన్ని వారాలు కూడా కాలేదు. ఆ ఘటన తర్వాత కూడా అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.సిఎంసి పరిధిలో ప్రశ్నలు: సిఎంసి పరిధిలో కొనసాగుతున్న అనుమతిలేని నిర్మాణాలపై అధికారులు ఎప్పుడు కఠిన చర్యలు తీసుకుంటారనే ప్రశ్న ప్రజల్లో ఉంది. గోకుల్ ప్లాట్స్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు తనిఖీలు చేయడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.అనుమతి లేకుండా, "జీరో పర్మిషన్"తో నిర్మాణాలు కొనసాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు. ఇకనైనా CMC అధికారులు అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? లేక ఎప్పటిలాగే మౌనం వహిస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకముందే అధికారులు అన్ని అనుమతిలేని నిర్మాణాలను తనిఖీ చేసి, అక్రమ కట్టడాలను కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ వాహనాన్ని ఢీకొన్న లారీ

- ఎస్సై, డ్రైవర్ కు తీవ్ర గాయాలు
- ఆసుపత్రిలో పరామర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్





**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** రాత్రి పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఎస్సైతో పాటు పోలీస్ వాహన డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీస్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీశ్ పరిస్థితి నిలకడగా వుంది, డ్రైవర్ కొత్తపల్లి రాకేష్ కు మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్ కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ రాత్రి ఆసుపత్రికి చేరుకుని గాయపడిన ఎస్సై, డ్రైవర్‌ను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం రాకేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. విధి నిర్వహణ లో భాగంగా రాత్రి పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడం పట్ల పోలీస్ కమిషనర్ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన సిబ్బంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.బుధవారం అర్ధరాత్రి పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు నుంచి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చేపల లోడుతో వెళ్తున్న ఏపీ -16- టి హెచ్ - 6179 నంబర్ గల లారీ తిరుమలాయపాలెం గ్రామ శివారులోని భవానీ హోటల్ సమీపంలో ఎదురుగా వస్తున్న పోలీస్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. లారీ డ్రైవర్ షేక్ రసూల్ (65) వాహనాన్ని వేగంగా నడుపుతూ ఢీకొట్టినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. లారీ డ్రైవర్‌పై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# జర్నలిస్టులకు అండగా నిలబడే దమ్మున్న యూనియన్ టి జె ఎఫ్ దే

- వచ్చే నెల మొదటి వారంలో ఖమ్మం డివిజన్ మహాసభలు
- టీజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి






**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా టీజెఎఫ్ అండగా ఉంటుందని, జర్నలిస్టుల కోసం నిలబడి కలబడే దమ్మున్న జర్నలిస్ట్ యూనియన్ టీజెఎఫ్ దే అని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీజెఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన టి యు డబ్ల్యూ జె (టి జె ఎఫ్) నగర కమిటీ, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రెస్ క్లబ్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చిర్రా రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసిన చరిత్ర తమ యూనియన్ దేనని , కష్టాల్లో ఉన్న వారికి ఆర్థిక సహాయం చేయడంతో పాటు కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో జర్నలిస్టులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. అక్రిడేషన్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల కోసం రాజీ లేని పోరాటాలు చేసిన ఘనత తమదే అన్నారు. వచ్చే నెల మొదటి వారంలో టి జె ఎఫ్ ఖమ్మం డివిజన్ మహాసభలు ఖమ్మంలో నిర్వహిస్తున్నామని, ఈ సభలను విజయవంతం చేసేందుకు జర్నలిస్టు మిత్రులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ యూనియన్ నుంచి వి5 బ్యూరో ఇన్చార్జ్ కెవి, విజన్ ఆంధ్ర బ్యూరో ఇన్చార్జ్ రామకృష్ణ,అశోక్, నాగేశ్వరరావు తదితరులు టీజేఎఫ్ యూనియన్ లో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మందులు ఉపేందర్, నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, అక్రిడేషన్ కమిటీ సభ్యులు నాగరాజు, నగర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు యలమందల జగదీష్, కరీష అశోక్,ఫోటోగ్రాఫర్ రవి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు,కోశాధికారి బిక్కి గోపి, ఉపాధ్యక్షులు పి. పానకాలరావు, ముత్యాల కోటేశ్వరరావు, పులి శ్రీను,రేపాక యాదగిరి, హుస్సేన్, సహాయ కార్యదర్శులు బోనగిరి యాదగిరి ఉల్లోజు రమేష్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, రవీందర్, మీడియా ఇన్చార్జ్ తిరుపతిరావు, మహిళ ప్రతినిధులు వంగూరి ఈశ్వరి, రోజా, మాధవి, కిరణ్మయి, శ్రీదేవి, నాగలక్ష్మి , సీనియర్ నాయకులు ఉత్కంఠం శ్రీను, సాయి కళ్యాణ్, ఎన్ టి వి సాయి, గౌరీ శంకర్, గోవింద్, నాగ శేఖర్, పెంటి వెంకటేశ్వర్లు, రవి,లింగయ్య, నరసింహ రావు, భద్రం, రాంబాబు, లక్ష్మణ్, వెంకన్న, నాగరాజు, కూరపాటి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్







**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** రఘునాథపాలెం మండలం కేవి బంజర బీఆర్ఎస్ నాయకులు భూక్యా బాబూలాల్ తండ్రి బాలు ఇటీవల మరణించగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వారి దశదిన ఖర్మకు హాజరై వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.పంగిడి గ్రామం బీఆర్ఎస్ నాయకులు రామోజీ రవి మాతృమూర్తి సుభద్రమ్మ ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఖమ్మం జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు 41 మంది నామినేషన్ల దాఖలు

**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఖమ్మం జిల్లా శాఖ తదుపరి మేనేజింగ్ కమిటీ ఏర్పాటుకు సంబంధించి సాధారణ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని, ఎన్నికలలో పోటీ చేయాలనుకునే అభ్యర్థుల నుంచి గురువారం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరించగా, మొత్తం 41 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి, ముఖ్య ప్రణాళికా అధికారి ఏ. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 25న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నట్లు, నామినేషన్ల ఉపసంహరణకు సెప్టెంబర్ 26న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు గడువు ఉన్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. పోటీదారుల తుది జాబితాను సెప్టెంబర్ 26న మధ్యాహ్నం 3.00 గంటలకు ప్రకటించనున్నట్లు తెలిపారు. పోలింగ్ ను అక్టోబర్ 4, 2026న ఉదయం 8.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు స్థానిక టీటీడీసీ భవనం, ఇల్లందు క్రాస్ రోడ్ లో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఖమ్మం జిల్లాలో 11 ఆహార భద్రతా కేసుల పరిష్కారం, రూ 2.90 లక్షల జరిమానా

**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లాలో ఆహార భద్రతా ప్రమాణాల అమలులో భాగంగా గౌరవనీయ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సమక్షంలో, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సి.హెచ్. లోకేష్ ఆధ్వర్యంలో నమోదైన 11 కేసులను పరిష్కరించి, సంబంధిత ఆహార వ్యాపార సంస్థలపై మొత్తం రూ 2,90,000/– జరిమానా విధించారు.జరిమానా విధించిన ముఖ్యమైన సంస్థలు:రమేష్ ధాబా – రూ 1,00,000/–హవేలీ – రూ 75,000/–రిలయన్స్ రిటైల్ – రూ రూ 50,000/–డిలైట్ మండీ – రూ 20,000/–జాజూ – రూ 20,000/–ఇతర కేసులు, మిగిలిన వాటికి జరిమానా విధించారు. ఆహార వ్యాపార సంస్థలు పరిశుభ్రత, నాణ్యత, ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. ఎఫ్ ఎస్ ఎస్ ఏఐ నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా ఖమ్మం జిల్లా ఆహార భద్రతా శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు, నమూనాల సేకరణ, అమలు చర్యలు నిరంతరం కొనసాగుతాయని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సి.హెచ్. లోకేష్ తెలిపారు.

# వల్లభనేని గురవయ్య కి నివాళులు అర్పించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం, కారేపల్లి, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** కారేపల్లి మండలం విశ్వనాధపల్లి గ్రామం నందు మాజీ ఆర్టీవో మెంబెర్, బీఆర్ఎస్ నాయకులు వల్లభనేని రామారావు తండ్రి గురవయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గురువారం వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గురవయ్య ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు.కార్యక్రమంలో నాయకులు కూరాకుల వలరాజు, ముత్యాల సత్యనారాయణ,వీరు నాయక్, లక్షణ్ నాయక్, దేవభక్తిని కిషోర్, వెంకయ్య, శ్రీనివాసరావు, సురేష్, వీరేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షంతో అవస్థలు





**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** మండలం లోని వివిధ గ్రామాలలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వలన ప్రజలు అవస్థలు పడ్డారు. గురువారం కురిసిన వర్షం కు మంగాపురంతండా లో భూక్యా శివాజీ కి చెందిన ఇళ్లు శిధిలావస్థలో ఉండటంతో పై కప్పు కూలింది. దీంతో ఇంటిలో ఉన్న సామాన్లు తడిసి ముద్దెయ్యాయి. దీంతో ఆ కుటుంబం బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాయి. మండలంలోని నాచేపల్లి–మంగాపురం గ్రామాల మధ్య రహదారి పై చెట్టు విరిగి పడటంతో రాకపోకలకు అంతరాయం కలగకుండా తక్షణమే చర్యలు చేపట్టారు. వివిధ గ్రామాలలో వర్షాలకు ప్రజలకు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు స్థానిక పంచాయతీ అధికారులను ఆదేశించారు. నాచేపల్లి రహదారి లో నిలిచిన రాకపోకల పై మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల 'సీతారాములు అప్రమతం చేశారు. చెట్లు తొలిగింపు పనులను పరిశీలించారు. మండలం లోని పలు కార్యాలయాలు, రహదారులు వర్షంకు తడిసి చిత్తడిగా మారాయి. చెరువుమాధారం చెరువు అలుగు పోసేందుకు చేరువలో ఉంది.

# రైతులు ఫార్మర్ రిజిష్టర్ చేయించకపోతే అన్ని బంద్

- 30 తో ముగుస్తున్న గడువు, సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లాలో 532.4.యం.యం. వర్షం నమోదు
- 378 గ్రామాలలో డిజిటల్ సర్వే శర వేగంగా సాగుతుంది
- 5.40 లక్షల ఎకరాలలో ఖరీఫ్ సీజన్ లో సాగు





**ఖమ్మం, నేలకొండపల్లి, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** రైతులు ఫార్మర్ రిజిష్టర్ చేయించకపోతే అన్ని బంద్ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రైతులకు పంట కొనుగోలు తో పాటు, ఎరువుల విక్రయాలు ఇతరత్రా సేవలకు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. జిల్లా లో 77.862. మంది రైతులకు గాను, ఇంకా 76 వేల మంది రైతులు రిజిస్ట్రేషన్చేయించు కోలేదన్నారు. వీరికి సమస్యలు తలెత్తకుండా వెంటనే చేయించాలన్నారు. ఈ నెల 30 లోపు చేయించకపోతే వారికి రాయితీలు రావని తెలిపారు. రైతాంగం కు 761.6 యం.యం. వర్షపు శాతం అవసరం కాగా ఇప్పటి వరకు 532.4 యం.యం. శాతం కురిసిందన్నారు. ఇంకా రెండు రోజులు ఇలా వర్షాలు కురిస్తే మిగిలిన 30 శాతంతో జిల్లాకు నీరు సరిపోతుందన్నారు. 18 మండలాలలో నీటి శాతం తక్కువగా ఉందన్నారు. కల్లూరు, కామేపల్లి, తల్లాడ మండలాలలో సాధారణ స్థితికి చేరిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 378గ్రామాలలో డిజిటల్ సర్వే 50 శాతం వరకు పూర్తి చేశామని, మరో 15 రోజులలో సర్వే ను పూర్తి చేస్తామన్నారు. సర్వే విషయం పై రైతులకు మెస్సెజ్ వస్తుందన్నారు. తప్పులు ఉంటే 72 గంటలలో సరిదిద్దుతారని పేర్కొన్నారు. జిల్లా లో 2,30,397 ఎకరాలలో వరి, 2, 35,637 ఎకరాలలో పత్తి, 30,169 ఎకరాలలో పెసర, 682 ఎకరాలలో కందులు, 333 ఎకరాలలో మినుములు, 1246 ఎకరాలలో చెరుకు ఇతరత్రా పంటలు కలిపి మొత్తం 5.40 లక్షల ఎకరాలలో పంటలు సాగులో ఉన్నట్లు తెలిపారు. ఈ వర్షాలు వలన అన్ని పంటలు సేఫ్ గా ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో గత ఏడాది కంటే యూరియాను అధికంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. గతేడాది 32.405 యం.టీ. లు వినియోగిస్తే, ఈ సీజన్ ఇప్పటి వరకు 39,618 యం.టీ. లను రైతులు అందించినట్లు తెలిపారు. యూరియా కు డోకాలేదన్నారు. వర్షాల పట్ల రైతులు 'అప్రమతంగా ఉండాలని సూచించారు. పొలాలలో నీరు నిల్వ లేకుండా తొలిగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విలేకర్ల సమావేశంలో మండల వ్యవసాయాధికారి యం.రాధ ఉన్నారు.సాయి చరణ్,స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ పి ఆర్ ఓ బండారి తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మున్నేరు వరద పరిస్థితిపై అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో సమీక్ష
- విద్యుత్ స్తంభాలు, వైర్లను తాకవద్దు
- చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** అకాల వర్షాల నేపథ్యంలో ఖమ్మం నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం సుడా చైర్మన్ శ్రీ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ సూచించారు.వర్షాలు కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు, ఇతర విద్యుత్ పరికరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చిన్నారులు వర్షపు నీటిలోకి వెళ్లకుండా, విద్యుత్ స్తంభాలు, వైర్లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.మరోవైపు మున్నేరు వరద పరిస్థితిపై చైర్మన్ సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నారు. మున్నేరు ప్రవాహానికి సంబంధించిన ఎగువ ప్రాంతాలు, మున్నేరులో కలిసే అకేరు, పాలేరు పరివాహక ప్రాంతాలతో పాటు ఖమ్మం రూరల్, పోలేపల్లి, తీర్థాల తదితర పరిసర ప్రాంతాల్లో వర్షపాతం, వరద ఉధృతి, నీటి మట్టం పరిస్థితిపై అధికారులు అందిస్తున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.మున్నేరు పరివాహక ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా వరద ఉధృతి పెరిగే అవకాశం ఉంటే ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను సుడా చైర్మన్ కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు."ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. వర్షాల సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి" అని సుడా చైర్మన్ శ్రీ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# భద్రాచలం కరకట్ట వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

- భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**ఖమ్మం, భద్రాచలం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** భద్రాచలం కరకట్ట వద్ద నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి చేపట్టిన భద్రతా, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో పాటు సంబంధిత శాఖల అధికారులతో కలిసి పర్యవేక్షించారు.వర్షాకాలం నేపథ్యంలో నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి జాప్యం, అంతరాయం కలగకుండా అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. భక్తుల రాకపోకలు, విగ్రహాల తరలింపు, ట్రాఫిక్ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నిమజ్జన వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో పటిష్ట పోలీసు బందోబస్తు, బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ డైవర్షన్స్ ఏర్పాటు చేయడంతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు గజ ఈతగాళ్లు, రెస్క్యూ సిబ్బంది, వైద్య సిబ్బంది, అందుబాటులో ఉండాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి నిమజ్జనానికి వచ్చే భక్తులు, గణేష్ శోభాయాత్ర నిర్వాహకులకు ముందుగానే రూట్ మ్యాప్ వివరాలను స్పష్టంగా తెలియజేయాలని ఎస్పీ సూచించారు. పోలీసు శాఖ సూచించే మార్గాల్లోనే ప్రయాణిస్తూ, ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. శోభాయాత్ర నిర్వాహకులు పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.నిమజ్జన సమయంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు భద్రాచలం బ్రిడ్జి – ఐజీ సెంటర్ – బస్టాండ్ – అంబేద్కర్ సెంటర్ – కూనవరం రోడ్ – డిగ్రీ కాలేజ్ – కరకట్ట – కరకట్ట నిమజ్జన పాయింట్ మార్గంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టారు. కరకట్ట నిమజ్జన పాయింట్ వద్దకు వచ్చే వాహనాల్లో ఇద్దరికి మించి వ్యక్తులు ప్రయాణించకుండా తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలని, వాహనాలను నిర్దేశిత ప్రాంతాల్లోనే పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా పోలీసు సిబ్బంది సూచించే ప్రత్యామ్నాయ మార్గాలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.నిమజ్జన పాయింట్ వద్ద టపాసులు కాల్చడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. నదిలోకి ప్రమాదకరంగా దిగడం, బారికేడ్లు దాటి వెళ్లడం, నిషేధిత ప్రాంతాల్లో నిలబడటం వంటి చర్యలకు ఎవరూ పాల్పడరాదని సూచించారు. నిమజ్జన విగ్రహాలను తరలించే వాహనాల కదలికలకు అంతరాయం కలగకుండా మార్గాలను ఖాళీగా ఉంచాలని, వాహనదారులు పోలీసుల సూచనలకు అనుగుణంగా ప్రయాణించాలని ఎస్పీ సూచించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.భక్తులు, శోభాయాత్ర నిర్వాహకులు పోలీసు శాఖ సూచించే భద్రతా, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, అధికారులకు సహకరించి శాంతియుతంగా, సురక్షిత వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో డీఎస్పీ అరుణ్ కుమార్, పోలీసు అధికారులు, రోడ్డు ట్రాన్స్పోర్ట్ అధికారులు, ఇతర శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్వమానవ శ్రేయస్సుకై..,

- భద్రాద్రి రామన్న - తిరుమల వెంకన్న మహాపాదయాత్ర లో త్రివేణి డైరెక్టర్లు



**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** భక్తి, ఆధ్యాత్మికత, సేవా భావాలను మేళవిస్తూ భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సన్నిధి నుండి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధి వరకు త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్లు నిర్వహిస్తున్న 8వ మహా పాదయాత్ర అత్యంత భక్తిశ్రద్ధలతో 16 వ తారీఖు ప్రారంభం అయ్యింది. ప్రతి నాలుగు సంవత్సరాలకి ఒకసారి ఎంతో భక్తి భావంతో చేపడుతున్న ఈ మహా పాదయాత్రకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. సర్వ మానవ హితం, సమాజ శ్రేయస్సు, ప్రజల సుఖసంతోషాలు, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, దేశ,రాష్ట్ర, అభ్యున్నతి కోసం స్వామివార్ల ఆశీస్సులు కోరుతూ ఈ పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వర రావు తెలిపారు.భద్రాద్రి రామన్న సన్నిధి నుంచి ప్రారంభమై, పాల్వంచ, కాకర్ల,మైలవరం,ఇబ్రహీంపట్నం, విజయవాడ, గుంటూరు ల మీదుగా కొనసాగనున్న ఈ ఆధ్యాత్మిక పాదయాత్ర గురువారం చిలకలూరిపేట కి చేరుకుని ,23 రోజుల తరువాత తిరుమల శ్రీవారి సన్నిధికి చేరుకోనుంది. వీరికి సంఘీభావంగా త్రివేణి విద్యాసంస్థలనుండి రోజుకి ఒకరు చొప్పున పాదయాత్రలో పాల్గొంటున్నారు. అదేవిధంగా పాఠశాలల ఐఐటీ సమన్వయ కర్త , ఖమ్మం బ్రాంచ్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సి ఏ సి నటరాజ్ లు గుంటూరులో పాదయాత్ర బృందాన్ని కలుసుకుని వారితో పాదం కదుపుతూ ముందుకు సాగారు. మార్గమధ్యంలో భక్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు పాదయాత్రికులకు తమ సహకారం, స్వాగతం అందిస్తూ ప్రతి పట్టణంలో ఒక్కొక్క మొక్కని నాటుతూ ముందుకు సాగుతోంది ఈ ఆధ్యాత్మిక యాత్ర."భక్తితో అడుగు, సేవతో నడుగు, సర్వ మానవ హితం కోసం సాగు" అనే సందేశంతో ఈ మహా పాదయాత్ర కొనసాగనుంది.త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్లు మాట్లాడుతూ భగవంతుని అనుగ్రహంతో ప్రతి నాలుగు సంవత్సరాలకి ఒకసారి చేపడుతున్న ఈ పాదయాత్ర ద్వారా ఆధ్యాత్మిక చైతన్యంతో పాటు మానవతా విలువలు, సేవా భావం, ఐక్యత, సమాజ శ్రేయస్సు వంటి సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం తమ ప్రధాన ఉద్దేశమని డైరెక్టర్లు తెలిపారు. ఈ మహాపాదయాత్ర లో డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వర రావు, పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీ కృష్ణ, సనత్ పాల్గొంటున్నారు.ఈ సందర్భంగా త్రివేణి విద్యా సంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాటలే బేఖాతర్

- గదుల్లోనే మూలుగుతున్న గత దసరా చీరలు
- ఖమ్మం జూబ్లీ క్లబ్‌లో గుట్టలుగా ప్రభుత్వ చీరల దృశ్యాలు
- ఏడాది గడిచినా పేద మహిళలకు అందని పండుగ కానుకలు
- మెప్మా అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు, బాధ్యత ఎవరిది..?



**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేదల కోసం పరితపించే వ్యక్తి గా పేరుంది. ఆయన చేసే అభివృద్ధి భవిష్యత్ తరాలకు ఆదర్శం అని చెప్పక తప్పదు. అలాంటి మంత్రి పేదల కోసం ఇచ్చిన హామీలను సైతం బేఖాతర్ చేయడం ఇప్పుడు ఖమ్మం నగరంలో పెద్ద హాట్ ట్రాపిక్ గా మారింది. వివరాలోకి వెళ్ళితే... పేద మహిళలకు దసరా పండుగ కానుకగా అందించాల్సిన చీరలు ఏడాది గడిచినా వారికి చేరలేదు. గత దసరా పండుగకు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వ చీరలు ఖమ్మం నగరంలోని జూబ్లీ క్లబ్‌లో గుట్టలు గుట్టలుగా నిల్వ ఉండటం అధికారుల పనితీరుపై తీవ్ర ప్రశ్నలు రేకెత్తిస్తోంది. పండుగ సందర్భంగా పేద మహిళలకు అందించాల్సిన చీరలు ఇలా గదులకే పరిమితం కావడం మెప్మా అధికారుల పర్యవేక్షణ తీరును ప్రశ్నార్థకం చేస్తోంది.దసరా పండుగ వేళ నిరుపేద మహిళలకు అందించాల్సిన చీరలు ఇప్పటికీ నిల్వ ఉండటం వెనుక కారణాలేమిటన్నది అంతుచిక్కడం లేదు. గత ఏడాది పంపిణీ చేయాల్సిన చీరలు ఇప్పటికీ జూబ్లీ క్లబ్‌లోనే ఉంటే వాటిని లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు ఏం చర్యలు తీసుకున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.--- మెప్మా అధికారుల పర్యవేక్షణ ఏదీప్రభుత్వం పేద మహిళల కోసం పంపిన చీరలు అర్హులకు చేరాయా లేదా అన్నది పర్యవేక్షించాల్సిన బాధ్యత మెప్మా అధికారులపై ఉంది. ఏడాది క్రితం పంపిణీ చేయాల్సిన చీరలు ఇంకా నిల్వ ఉండటంతో అధికారుల పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చీరలు ఎన్ని వచ్చాయి, ఎన్ని పంపిణీ చేశారు, ఇంకా ఎన్ని నిల్వ ఉన్నాయి అనే వివరాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుంది. కానీ గత దసరా చీరలే ఇంకా గదుల్లో ఉంటే పథకాల అమలులో అధికారుల బాధ్యత ఎంతవరకు నెరవేరిందన్నది చర్చనీయాంశంగా మారింది. నిల్వ ఉన్న చీరల పరిస్థితి, వాటి పంపిణీలో జాప్యానికి గల కారణాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.గత దసరా చీరలు ఈ దసరాకైనా పేద మహిళలకు అందుతాయా లేక జూబ్లీ క్లబ్ గదుల్లోనే మిగిలిపోతాయా మెప్మా అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి.

# ఘనంగా శ్రీనివాస్ రావు జన్మదిన వేడుకలు





**మియాపూర్ , సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ కు చెందిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు గోపరాజు శ్రీనివాస రావు జన్మదిన వేడుకలు గురువారం రోజు మియాపూర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి స్వర్ణపురి కాలనీ కమ్యూనిటీ హాల్లో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు రవి యాదవ్, మిద్దెల మల్లారెడ్డి, కొంచెం శివరాజ్ ముదిరాజ్, శ్రీకాంత్ యాదవ్, తదితరులు హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# అన్నదానంకు వెళ్లి.. అనంతలోకాలకు వెళ్లిండు

- డ్రైయినేజీలో పడి మృతి



**ఖమ్మం, నేలకొండపల్లి, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** వినాయక మండపం వద్ద అన్నదానం కు వెళ్లి...అనంతలోకానికి వెళ్లాడు...స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలంలోని శంకరగిరితండా గ్రామానికి చెందిన తేజావత్ బాలా (60) అనే వృద్ధుడు బుధవారం రాత్రి గ్రామంలో వినాయక మండపం వద్ద అన్నదానం జరుగుతుండుగా...భోజనం చేసి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు మురుగు కాల్వలో పడ్డాడు. గురువారం తెల్లవారు జామున డ్రైయినేజీలో విగతజీవిగా పడి ఉన్నాడు. చీకట్లో వర్షం కారణంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గమనించకపోవటంతో డ్రైయినేజీలో పడి మృతి చెందినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

# కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్లతో మాట్లాడిన మంత్రి తుమ్మల



**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** గత రెండు రోజులు నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం సాయంత్రం ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్లతో మంత్రి తుమ్మల హైదరాబాదు నుండి చరవాణి ద్వారా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రధాన జలాశయాల్లో నీటిమట్టం వాటి వివరాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి తో పాటు ఇతర అంశాలపై అడిగి తెలుసుకుని మంత్రి తుమ్మల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రానున్న రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వాగులు వంకలు, పొంగి పొరలే అవకాశమున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి తుమ్మల తెలిపారు.

# యూపీఐ ఛార్జీల నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి

- టి. రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్చార్జి..





**శేరిలింగంపల్లి , సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో డిజిటల్ చెల్లింపులపై అదనపు భారం మోపే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్చార్జి టి. రామకృష్ణ డిమాండ్ చేశారు.దేశంలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు వ్యాపారి లావాదేవీలపై యండిఆర్ విధించే విధానాన్ని తీసుకురావడం చిన్న వ్యాపారులు, చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులపై అదనపు ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉందన్నారు. కేంద్రం ప్రకటించిన కొత్త విధానంలో ₹2,000 పైబడిన నిర్దిష్ట వ్యాపారి లావాదేవీలకు ఎండి ఆర్ వర్తిస్తుందని తెలిపారు.ఇప్పటికే పెరుగుతున్న ధరలు, పన్నులు, వ్యాపార నిర్వహణ ఖర్చులతో సతమతమవుతున్న చిన్న వ్యాపారులపై మరో రకమైన చెల్లింపు భారం మోపడం సమంజసం కాదన్నారు. ఈ ఖర్చు చివరకు వస్తువుల ధరల పెరుగుదల రూపంలో వినియోగదారులపై పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.డిజిటల్ ఇండియా పేరుతో ప్రజలను, చిన్న వ్యాపారులను భారాల బాట పట్టించవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. యూపీఐ వంటి ప్రజలకు ఉపయోగపడే డిజిటల్ చెల్లింపు వ్యవస్థను పూర్తిగా ఉచితంగా కొనసాగించడంతో పాటు, చిన్న వ్యాపారులపై ఎలాంటి ఎం డి ఆర్ భారం లేకుండా స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రజల జేబులకు చిల్లు పెట్టే విధానాలను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, యూపీఐ పై ఛార్జీల విధానాన్ని పునఃపరిశీలించి పూర్తిగా ఉపసంహరించుకోవాలని టి. రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రజలు, చిన్న వ్యాపారులపై అదనపు భారం మోపడం కేంద్రం మానుకోవాలిటి. రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్చార్జినిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో డిజిటల్ చెల్లింపులపై అదనపు భారం మోపే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్చార్జి టి. రామకృష్ణ డిమాండ్ చేశారు.దేశంలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు వ్యాపారి లావాదేవీలపై ఎం డి ఆర్ విధించే విధానాన్ని తీసుకురావడం చిన్న వ్యాపారులు, చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులపై అదనపు ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉందన్నారు. కేంద్రం ప్రకటించిన కొత్త విధానంలో ₹2,000 పైబడిన నిర్దిష్ట వ్యాపారి లావాదేవీలకు యం డి ర్ వర్తిస్తుందని తెలిపారు.ఇప్పటికే పెరుగుతున్న ధరలు, పన్నులు, వ్యాపార నిర్వహణ ఖర్చులతో సతమతమవుతున్న చిన్న వ్యాపారులపై మరో రకమైన చెల్లింపు భారం మోపడం సమంజసం కాదన్నారు. ఈ ఖర్చు చివరకు వస్తువుల ధరల పెరుగుదల రూపంలో వినియోగదారులపై పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.డిజిటల్ ఇండియా పేరుతో ప్రజలను, చిన్న వ్యాపారులను భారాల బాట పట్టించవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. యూపీఐ వంటి ప్రజలకు ఉపయోగపడే డిజిటల్ చెల్లింపు వ్యవస్థను పూర్తిగా ఉచితంగా కొనసాగించడంతో పాటు, చిన్న వ్యాపారులపై ఎలాంటి ఎండీర్ భారం లేకుండా స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రజల జేబులకు చిల్లు పెట్టే విధానాలను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, యూపీఐ పై ఛార్జీల విధానాన్ని పునఃపరిశీలించి పూర్తిగా ఉపసంహరించుకోవాలని టి. రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడి ఆస్తుల జప్తు

**ఖమ్మం, భద్రాచలం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** ప్రభుత్వం నిషేధించిన గంజాయిని అక్రమంగా కొనుగోలు చేసి రవాణా చేస్తూ పట్టుబడిన నిందితుడి ఆస్తులను, అతని భార్య బ్యాంక్ ఖాతాను ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా జప్తు చేసినట్లు ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.28 ఆగష్టు, 2025న ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నెంబర్. 136/2025, యు /ఎస్ఈసి 8(సి) ఆర్ /డబ్లూ 20(బి) (ii)(సి), 27(ఏ ), 29 ఆఫ్ ఎన్ డిపిఎస్ యాక్ట్ – 1985 కేసులో నిందితుడు పల్లపు రఘు అక్రమ గంజాయి రవాణా ద్వారా సంపాదించినట్లు గుర్తించిన ఆస్తులపై ఆర్థిక దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడి పేరుతో ఉన్న రెండు కార్లు, ఒక మోటార్ సైకిల్, అలాగే అతని భార్యకు సంబంధించిన బ్యాంక్ ఖాతాను చెన్నై కాంపిటెంట్ అథారిటీ ద్వారా ఫ్రీజింగ్ ఆర్డర్ పొందిన అనంతరం, న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు జప్తు చేసినట్లు సీఐ వెల్లడించారు. జప్తు చేసిన ఆస్తులు, బ్యాంక్ ఖాతా విలువ మొత్తం సుమారు రూ.21,15,907/-గా ఉన్నట్లు తెలిపారు. ఆస్తులు జప్తు చేయబడిన నిందితుడి వివరాలు:పల్లపు రఘు, తండ్రి ఎల్లయ్య, వయస్సు 35 సంవత్సరాలు, వృత్తి: కారు డ్రైవర్, స్వస్థలం: మండేపల్లి గ్రామం, చిన్నకోడూర్ మండలం, సిద్దిపేట జిల్లా. ప్రస్తుతం ఉప్పల్, హైదరాబాద్‌లో



నివాసం.గంజాయి అక్రమ కొనుగోలు, రవాణా వంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు, నేరాల ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి జప్తు చేసేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడిని అరెస్టు చేయడమే కాకుండా, నేరం ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి జప్తు చేసేలా సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టిన ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

# వర్షపు మురుగు నీటిలో తేలాడుతున్న విద్యార్థులు

- **నరకప్రాయంగా వసతిగృహాల విద్యార్థుల బాట**
- **కొరవడిన అధికారులు పర్యవేక్షణ వసతి గృహాల వైపు కన్నెత్తి చూడని డీడీలు**
- **ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంక్షేమ వసతి గృహాల ముందు మురుగు నీటిని తొలగించాలని ధర్నా**





**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** సంక్షేమ వసతి గృహాల్లో అడుగడుగునా విద్యార్థులను అసౌకర్యాలు వెంటాడుతూ నరక కూపాన్ని తలపిస్తున్నాయనీ, వెంటనే మరమ్మతులు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా కార్యదర్శి చింతల రమేష్ ప్రభుత్వం డిమాండ్ చేశారు.స్థానిక ఖమ్మంలోని గురువారం అధిక వర్షపాతం నమోదు కావడంతో ఎన్ఎస్పి క్యాంపు లో ఉన్న సంక్షేమ వసతి గృహాలను చుట్టుముట్టిన వర్షపు మురుగు నీటిలో తేలి ఆడుతున్న విద్యార్థుల గోడు ప్రభుత్వానికి పట్టదా అని వారు ప్రశ్నించారు. వసతి గృహాల నిర్వహణ పట్టించుకోవాల్సిన సంబంధిత డీడీలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని దీంతో విద్యార్థులు సమస్యలు పట్టించుకునే నాథుడే లేడాని వారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం అనుచిత ధోరణి వలనే వసతి గృహాలు సమస్యలతో విలయతాండవం చేస్తున్నయనే వారన్నారు. చెరువుల మారిన వసతి గృహాల ప్రాంగణాలు. ప్రాంగణంలో చేరిన మురుగు నీటిని తొలగించి శిథిలావస్తులు చేరుకున్న భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించి పేరుకుపోయిన వర్షపు నీరును తక్షణమే తొలగించి డ్రైనేజీ ప్రహరీ గోడ నిర్మించాలన్నారు. అంటు వ్యాధుల భయంతో అంధకారంలో వసతిగృహాల విద్యార్థులు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు తక్షణమే జిల్లా. డీడీలు స్పందించి సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే డీడీలు కార్యాలయాలని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బుర్ర మనోజ్, జిల్లా ఉపాధ్యక్షులు శివ, భాస్కర్, పవన్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ విడుదల : డాక్టర్ ఎం సునీత

**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** ఖమ్మంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం అడ్మిషన్ల లో భాగంగా ఉన్నత విద్యాశాఖ దోస్త్ ద్వారా స్పాట్ అడ్మిషన్ ప్రక్రియని విడుదల చేయడం జరిగింది. కళాశాలలో ఈ క్రింది కోర్సులలో ఖాళీలు ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సునీత తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ ఇంగ్లీష్ మీడియంలో బిఏ, బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్, బిజినెస్ అనలిటిక్స్), బీఎస్సీ ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్ సిఎస్, బిజెడ్ సి, ఎంబిజెడ్ సి గ్రూపులలో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఇంటర్ రెండవ సంవత్సర చదివిన అర్హత గల విద్యార్థినులు సెప్టెంబర్ 25,26 వ తేదీలోపు తగిన ధ్రువీకరణ పత్రాలతో ( ఎస్ ఎస్ సి మెమో, టిసి, ఇంటర్ మెమో, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ, ఆధార్ కార్డు జిరాక్స్, మూడు కలర్ ఫోటోలు ) కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



వివరాలకు 7995010677, 8096408154, 9505389305 మొబైల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

# గాళ్ల సుబ్రమణ్యం పార్థివదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించిన ఆకుల గాంధీ, తాళ్లూరి హనుమంతరావు తదితరులు

**ఖమ్మం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాళ్లూరి హనుమంతరావు తదితరులు కాపు నాడు జాతీయ అధ్యక్షులు గాళ్ల సుబ్రమణ్యం పార్థివదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. సుబ్రమణ్యం ఈనెల 22వతేదీ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందగా, అంత్యక్రియలు గురువారం విజయవాడలో జరిగాయి. ఈ సందర్భంగా గాంధీ, హనుమంతరావు,శెట్టి శ్రీనివాసరావు, ఆకుల సురేష్ తదితరులు స్వర్గీయ సుబ్రహ్మణ్యం భౌతికకాయాన్ని సందర్శించి పూలదండలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.ఈ సందర్భంగా వారు దివంగత నేత కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర సంతాపం తెలిపారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు



# గణేష్ బందోబస్తు విధి నిర్వహణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్సై కున్సోత్ వెంకన్న మృతి

- **ఎస్సై కున్సోత్ వెంకన్న మరణం పోలీస్ శాఖకు తీరని లోటు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రగాఢ సంతాపం**



**ఖమ్మం, భద్రాచలం, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** విధి నిర్వహణలో భాగంగా వినాయక చవితి బందోబస్తు విధులు నిర్వహిస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ సబ్ఇన్‌స్పెక్టర్ కుంశోత్ వెంకన్న (57) మృతి పట్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి ప్రగాఢ సంతాపం తెలిపారు.బుధవారం తెల్లవారుజామున సుమారు 02:00 గంటల సమయంలో హైదరాబాద్‌లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో, ట్యాంక్‌బండ్ ప్రాంతంలోని ఎన్టీఆర్ గార్డెన్ మార్గంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో వినాయక చవితి బందోబస్తు విధులు నిర్వహిస్తున్న సమయంలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని ద్విచక్ర వాహనదారుడు అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ వెంకన్నను ఢీకొట్టాడు. ప్రమాదం జరిగిన వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే గాయాల తీవ్రత కారణంగా బుధవారం సాయంత్రం 17:40 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్ఐ కున్సోత్ వెంకన్న మృతి పోలీస్ శాఖకు తీరని లోటని ఎస్పీ తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వెంకన్న కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆయన కుటుంబ సభ్యులకు కల్పించాలని, మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.వెంకన్న కుటుంబానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిరలో

- **దోస్త్ -2026-27 స్పాట్ అడ్మిషన్లు**
- **సెప్టెంబర్ 24, 25 తేదీలలో స్పాట్ అడ్మిషన్లు**
- **సెప్టెంబర్ 28, 29 తేదీలలో వన్‌టైమ్ స్పెషల్ స్పాట్ అడ్మిషన్లు**




**ఖమ్మం, మధిర, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిరలో దోస్త్ –2026–27లో మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి సంబంధించి స్పాట్ అడ్మిషన్లు సెప్టెంబర్ 24, 25 తేదీలలో, అలాగే వన్‌టైమ్ స్పెషల్ స్పాట్ అడ్మిషన్లు సెప్టెంబర్ 28, 29 తేదీలలో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రవీంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి ఉన్న అభ్యర్థులు సంబంధిత తేదీలలో కళాశాలకు నేరుగా హాజరై ఒరిజినల్ సర్టిఫికేట్లతో ధృవీకరణ (వెరిఫికేషన్ ) చేయించుకోవాలని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికేట్ల ధృవీకరణ లేకుండా స్పాట్ అడ్మిషన్లకు అనుమతించబడదని పేర్కొన్నారు.వన్‌టైమ్ స్పెషల్ స్పాట్ అడ్మిషన్లలో ముందుగా లోకల్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, లోకల్ అభ్యర్థులు అందుబాటులో లేనప్పుడు మిగిలిన సీట్లను నాన్–లోకల్ అభ్యర్థులకు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే ఏదైనా కళాశాలలో అడ్మిషన్ పొందిన అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్లకు పరిగణించబడరని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఎస్. ఎస్. సి మార్కుల మెమో, ఇంటర్మీడియట్ లేదా సమానమైన సర్టిఫికెట్, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టి. సి), స్టడీ సర్టిఫికెట్లు ఒరిజినల్స్‌తో పాటు, వర్తించే సందర్భంలో కుల, ఆదాయ, నివాస మరియు బ్రిడ్జ్ కోర్స్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరిన అభ్యర్థులకు ఫీస్ రీయింబర్స్‌మెంట్ వర్తించదని పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిరలో పీహెచ్‌డీ, సెట్,నెట్ అర్హతలు కలిగిన అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం నాణ్యమైన విద్యను అందిస్తున్నదని ప్రిన్సిపాల్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రవీంద్రారెడ్డి (9440257256), వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి జి. అరుణ (9441786508), దోస్త్ సమన్వయకర్త డా. ఎస్. ఇందిర (9553359879), డా. పి. సుజాత (9177734879)లను సంప్రదించాలని కోరారు.

# ఎస్ ఆర్ ఎస్టేట్స్ గణపతి లడ్డూ వేలం పాట విజేతలు..





**మియాపూర్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్ ఆర్ ఎస్టేట్స్ లోని గణపతి లడ్డూ ప్రసాదాన్ని 2,11,116 లకి దక్కించుకున్న లక్ష్మీ బాలకృష్ణ దంపతులు, బాల గణపతి లడ్డూ ప్రసాదాన్ని వేలంపాటలో 115000 కీ దక్కించుకున్న డొనేపూడి మౌనిక సాయి కిరణ్ దంపతులు ఈ సందర్భంగా ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ వారికీ శుభాకాంక్షలు తెలిపారు

# ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు.. విచారణకు డిమాండ్





**శేరిలింగంపల్లి , సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖాజాగూడ గ్రామం సర్వే నంబర్ 27/1లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి భారీ కమర్షియల్ భవనం నిర్మించారంటూ జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు అందింది.ప్రభుత్వ దళితుల ఉపాధి కోసం కేటాయించిన స్థలంతో పాటు, దానికి ఆనుకుని ఉన్న మరో మూడు, నాలుగు ప్లాట్లను కూడా ఆక్రమించి నిర్మాణం చేపట్టినట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. నిర్మాణానికి సంబంధించి తప్పుడు పత్రాలు సమర్పించి జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణతో పాటు స్థల పరిశీలన నిర్వహించి, ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగినట్లు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం జరిగి ఉంటే దాన్ని తొలగించి, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసిన విధానం, సమర్పించిన పత్రాల చట్టబద్ధత, సంబంధిత అధికారుల పాత్రపై కూడా విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఈ విషయంపై అత్యవసరంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

# ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకలు





**హైదరాబాద్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావునగర్ డివిజన్‌లోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ఇతర సదుపాయాల కోసం ప్రతిపాదనలు అందిస్తే, అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలల అభివృద్ధికి కూడా తగిన ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.అనంతరం కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మొక్కను నాటి నీరు పోశారు. కళాశాల డైరెక్టర్ సమర్పించిన పలు అభివృద్ధి అవసరాలు, డిమాండ్లపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, ప్రభుత్వ స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయుష్ డైరెక్టర్ నస్రత్ ఖాన్, డాక్టర్ బర్మేష్ నాయక్, ఆయుష్ పరిపాలనాధికారి శివరామ్, అదనపు డైరెక్టర్ డాక్టర్ వసంతరావు, కాంగ్రెస్ నాయకులు శంకర్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాటేదాన్ బీజేపీ కార్యాలయంలో వినాయక నిమజ్జనం

**కాటేదాన్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** కాటేదాన్ లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శ్రీ వినాయక విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి సోమవారం సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి, సన్నాయి వాయిద్యాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి కార్యాలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి కొలనులో వినాయక విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విఘ్నాలు తొలగించి ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని వినాయకుడిని ప్రార్థించినట్లు తెలిపారు. గణపతి బప్పా మోరియా నినాదాలతో నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రాజేంద్రనగర్‌లో దారుణ హత్య

## స్నేహితుడిని కత్తులతో పొడిచి చంపిన మిత్రులు



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య చోటు చేసుకుంది. ఉప్పరపల్లి హ్యాపీ హోమ్స్‌కు చెందిన వసీం అనే యువకుడిని అతని స్నేహితులే కత్తులతో పొడిచి అతి కిరాతకంగా హత్య చేశారు. పోలీసుల కథనం ప్రకారం, వసీంతో పాటు నిందితులపై గతంలో ఎన్‌డిపిఎస్ (డ్రగ్స్) కేసులు ఉన్నాయి. వీరంతా కలిసి డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం. అయితే డ్రగ్స్ దందా విషయాన్ని వసీం పోలీసులకు లీక్ చేస్తున్నాడనే అనుమానంతో నిందితులు కక్ష పెంచుకున్నారు. నిన్న రాత్రి స్నేహితుల మధ్య వాగ్వాదం జరగగా, మాట మాట పెరిగి ఇద్దరు నిందితులు కలిసి వసీంపై కత్తులతో దాడి చేసి విచక్షణారహితంగా పొడిచి చంపారు. తీవ్ర రక్తస్రావంతో వసీం అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# అత్తాపూర్ పోలీసుల సాహసం

- ఆత్మహత్య నుండి యువకుడిని కాపాడారు




**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** అత్తాపూర్ పోలీసుల చాకచక్యం, సత్వర స్పందనతో ఓ యువకుడి ప్రాణాలు నిలబడ్డాయి.బుధవారం మధ్యాహ్నం 1 గంటకు ఇన్స్పెక్టర్ సీతయ్యకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. తన స్నేహితుడు భాను ప్రకాష్ ఆత్మహత్య చేసుకుంటానని చెప్పాడని, వెంటనే కాపాడాలని స్నేహితుడు వేడుకున్నాడు.ఇన్స్పెక్టర్ సీతయ్య ఏమాత్రం ఆలస్యం చేయకుండా కానిస్టేబుళ్లు అజ్మత్ అలీ, అహ్మద్ లను లొకేషన్ కు పంపించారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్నారు.యువకుడిని సురక్షితంగా పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి ఇన్స్పెక్టర్ సీతయ్య కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించిన అత్తాపూర్ పోలీసులకు స్థానికుల నుండి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# దానం నాగేందర్ అనర్హతపై కౌశిక్ రెడ్డి హర్షం



**హైదరాబాద్, సెప్టెంబర్ 24, నేటి శుభోదయ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై అనర్హత వేటును సుప్రీంకోర్టు సమర్థించడాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్వాగతించారు. పార్టీ అధినేత కేసీఆర్ మార్గదర్శకత్వంలో న్యాయపోరాటం చేసి కావాల్సిన ఫలితం సాధించామని ఆయన అన్నారు. పార్టీ మారిన ప్రజాప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్న తమ వాదనకు ఈ తీర్పు బలం చేకూర్చిందని స్పష్టం చేశారు. ఇదే సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల తీరుపై కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండు పార్టీలు అంతర్గతంగా కలిసి పనిచేస్తున్నాయని, పెద్ద ఎత్తున కుమ్మక్కు రాజకీయం సాగుతోందని ఆరోపించారు. ఒకరి స్వార్థం కోసం మరొకరు సహకరిస్తూ నాటకాలు ఆడుతున్నారని, ఇది సిగ్గుమాలిన చర్య అని అభివర్ణించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కోర్టులు వేగంగా తీర్పులు ఇస్తున్నాయని కొందరు ఎద్దేవా చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. న్యాయస్థానాల వేగాన్ని, విచారణ తీరును తక్కువ చేసి మాట్లాడటం అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. చట్టం తన పని తాను చేస్తుందని, న్యాయవ్యవస్థ ఇచ్చిన తీర్పులను గౌరవించాలని సూచించారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620